ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
6 ఫిబ్రవరి, 2011

ENTERED



నవరసాల బాటసారి

'పద్మ' తేజం

2011 హ్యాపీ బర్త్‌డే

(2011 ఫిబ్రవరి 6 నుంచి
2011 ఫిబ్రవరి 12 వరకు)

శిరీష
1సం॥,ఫిబ్రవరి-2010
గాయత్రి-బాలరాజు
కొత్తకోట-మ॥నగర్



అమ్ము
1సం॥,ఫిబ్రవరి-6
మంజుల-మదనాచారి
లక్ష్మీదేవికాల్వ-నల్లగొండ

అదితి రాజ్
1సం॥,ఫిబ్రవరి-2010
శిరీష-వెంకటేష్‌రాజ్
బోలక్‌పూర్-సికింద్రాబాద్

సిద్ధు
6సం॥,ఫిబ్రవరి-6
మంజుల-నాగేష్
ఆరుట్ల-రంగారెడ్డి

సాయికిరణ్
8సం॥,ఫిబ్రవరి-8
మంజుల-నాగేష్
ఆరుట్ల-రంగారెడ్డి

బి. సాయి చరణ్
1సం॥,ఫిబ్రవరి-7
ఉమాదేవి-అబ్రహం
అశ్వారావు పేట-ఖమ్మం

ఎన్.కె. షబ్నమ్
1సం॥,ఫిబ్రవరి-9
జహెదా-ఖలీల్‌బాషా
అశ్వారావు పేట-ఖమ్మం

లాలి
1సం॥,ఫిబ్రవరి-8
లక్ష్మి-లెనిన్
గుంటూరు

పి. వల్లవీప్రజ్ఞ
2సం॥,ఫిబ్రవరి-12
శైలజ-అజయ్‌కుమార్
విజయవాడ

ఎం. రమ్యశ్రీ
7సం॥,ఫిబ్రవరి-11
పద్మ-శ్రీనివాస్
జమ్మిగడ్డ,కాప్రా-హైదరాబాద్

ఎం.గణేష్
1సం॥,ఫిబ్రవరి-2010
సుజాత-మధు
కర్నూలు

ఎం.లోహిత్
1సం॥,ఫిబ్రవరి-2010
స్వర్ణలత-విక్రమ్
కర్నూలు

శ్రీసాయి చరణ్
ఫిబ్రవరి
అనురాధ-గణేష్
గోషామహల్-హైదరాబాద్

ఎం.దివ్యశ్రీ
4సం॥,ఫిబ్రవరి-2007
శారద-ప్రసాదరావు
కర్నూలు

మనలో మాట

ఎదుటివాడికే నీతులు...

పూర్వం ఓ హరిదాసు వుండేవాడు. మాంచి మాటకారి. హరికథ చెప్పాడూ అంటే శ్రోతలు మైమరిచిపోయి వినేవారు. లోక రీతి, మంచి-చెడ్డ, పాపం-పుణ్యం గురించి హత్తుకునేలా చెప్పేవాడు. ఓ రోజు ఆహారనియమాల గురించి చెప్తూ విశ్వామిత్రుడు సృష్టించిన ఉల్లిపాయలు తినకూడదని సెలవిస్తాడు. అప్పడే మనిషి సాత్వికంగా వుంటాడనీ మృగలక్షణాలేవీ బయటికి రావని కూడా వివరిస్తాడు. హరికథా కాలక్షేపం అయ్యాక ఇల్లు చేరతాడు. మాంఛి ఆకలిమీద వున్నాడేమో ఒక పట్టు పడదామని విస్తరి ముందు కూర్చుంటాడు. భార్య వడ్డిస్తుంది. కూరన్నం ఒక ముద్ద నోట్లో పెట్టుకోగానే అందులో ఉల్లిపాయ లేదని గ్రహిస్తాడు.

"ఉల్లిపాయ లేకుండా శాకం చేసి నామొహాన పడేశావేమిటే" అంటాడు కోపంగా.

"ఇందాక మీరే కదండీ చెప్పారు. నేను పాటించాను. తప్పేవిటీ?" అంటుందావిడ అమాయకంగా.

"పెచ్చిమొద్దూ! శాస్త్రం ఊళ్లోవాళ్లకుగానీ మనకు కాదు. తెల్సిందా! రేపటి నుంచి మామూలుగా ఉల్లిపాయ దట్టించి కూరొండు" అంటాడు.

అంకుల్ శ్యామ్ సరిగ్గా ఇలాంటివాడే. ఈ పెద్దమనిషి ప్రకారం శాస్త్రాలు, నీతులు ఎదుటివాడికేగాని తనకు వర్తించవు. ఆయన చెప్పే మాటలకు చేతలకు పొంతనే వుండదు.

అనుక్షణం ప్రజాస్వామ్య జపం చేస్తాడు. మానవవిలువల గురించి ఉపన్యాసాలు గుప్పించేస్తాడు. ఆ మిషతోనే విదేశాలపైకి తెగబడతాడు. లక్షల మందిని చంపేస్తాడు. అక్కడే తిష్ట వేస్తాడు. ఇతర దేశాల్లో తల దూర్చి కుట్రలు చేస్తాడు. సోషలిస్టు దేశాలమీద కఠినమైన ఆంక్షలు విధిస్తాడు. ప్రజాస్వామ్యం చూద్దామన్నా కానరాని సౌదీ అరేబియా, ఈజిప్టు వంటి దేశాల అధినేతలు అతనికి మంచి నేస్తాలు. అక్కడ ఎన్నికలు, ఓట్లు వంటి మాటలు విని ఎనేళ్లయిందో. అలాంటి నియంతలకు గాడ్‌ఫాదర్ అంకుల్ శ్యామ్.

తన కుట్రలు, కుతంత్రాలను వెల్లడిచేసిన వికీలీక్స్ అసాంజేని వెంటాడి వేటాడతాడు.

మన దేశం వచ్చినప్పుడు టెర్రరిజంపై ఉమ్మడిపోరు చేద్దామంటాడా! పాక్‌ను విమర్శించి మనల్ని సంతోషపెడతాడా! తీరా అక్కడికెళ్లి వారికి సైనిక, ఆర్థిక సాయం చేస్తాడు. బిన్‌లాడెన్లవంటి టెర్రరిస్టులను సృష్టిస్తాడు. తన చెయ్యి దాటిపోయినప్పుడు లాడెన్ల పీడ విరగడచెయ్యడానికి అంతా ఏకం కావాలంటాడు.

స్వేచ్ఛా మార్కెట్ గురించి ఊరించే కబురులెన్నో చెప్తాడా? మార్కెట్లను బార్లా తెరవమంటాడా! తీరా చిన్నదేశాలు రాబోతే వెయ్యివంకలు చెప్పి అడ్డుకుంటాడు.

తమ దేశం వచ్చి చవగ్గా చదువుకోండి బాబూ అంటూ విద్యార్థులను ఆహ్వానిస్తాడు. అందుకు అవసరమైన యూనివర్సిటీలను, దళారులను ఏర్పాటు చేస్తాడు. తీరా అక్కడికెళ్లాక ఆ యూనివర్సిటీలు చేసిన తప్పలకు, మోసాలకు ఈ విద్యార్థులను బలిచేస్తాడు. దొంగలకు, హంతకులకు వేసినట్టు కాళ్లకు రేడియో కాలర్లు తగిలిస్తాడు. భారతీయులను బానిసలకన్నా హీనంగా చూస్తాడు.

అమెరికా మార్కు 'ఉల్లిపాయ నీతి' శాస్త్రం.

నీతులు ఎదుటివాడికే. ఆచరించడానికి కాదు! ★

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	3
ఈ పేజ్	...	6
సీరియల్	...	8
కొత్త పుస్తకాలు	...	9
నవ్వుల్ పువ్వుల్	...	10
విక్టోరియా మ్యూజియం...		12
హిమాలయాల నడుమ ఎడారి లెహ్	...	13
అట్టమీది కథ	...	14
కథ	...	18
వికాసం	...	20
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

'నానీ'లే 'నానీ'లైన వేళ...4



రుచి ... 11

సజ్జ పోలెలు

తెల్సా... 21

ఆ గౌను 1.5 మిలియన్ డాలర్లు



తెలియని సినీ సంగతులెన్నో...

వికీపీడియా గురించి చక్కని అవగాహన కలిగించిన కె.ఎక్స్ రాజుగారికి కృతజ్ఞతలు. తొమ్మిది పదుల వయసులో తండ్రి అయిన వైనం ఔరా అనిపించింది. బాల నేస్తాలు పేజీ కాలక్షేపంగా వుంది. సాహిల్ ఉదహరించిన సాహస బాలల గాథలను అన్ని పాఠశాలల్లో తెలుసుకునే విధంగా ఏర్పాటు చేయడం అవసరం. కవితలన్నీ సాధారణంగా అనిపిస్తూనే ఉన్నత భావాలను వ్యక్తపరచడం గమనార్హం. ఎవరికీ తెలియని సినీ సంగతులెన్నింటినో మా ముందుంచే ప్రయత్నం చేస్తున్న రెంటాల జూనియర్‌కి ధన్యవాదాలు. సుందర నగరం కోపెన్ హాగెన్ విశేషాలు బాగున్నాయి. 'వికాసం' పేజీ పెద్దలందరూ చదివి ఆకళింపు చేసుకోవాల్సిందే. 'తెల్సా' అంశాలు బాగున్నాయి. మాగ్జిమ్ గోర్కీ నవల అమ్మ సరికొత్తగా వెలువడిన విషయం కొత్త పుస్తకాల ద్వారా తెలిసింది. సీరియల్ ఆసక్తిదాయకంగా సాగుతోంది. నగ్న సత్యాలు చెప్పే మనలోమాట బాగుంది. దేశంలో ఇలాంటి దారిద్ర్యం పెట్టుకుని ఉత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటన్నది చేదునిజం.

నేమాన సుభాష్‌చంద్రబోస్, ఇలిసిపురం.

వికీపీడియాకు అభినందనలు

గత పదేళ్లుగా ఉచిత విజ్ఞాన సమాచారాన్ని అందిస్తున్న వికీపీడియాకు అభినందనలు. దీని ద్వారా ఎన్నో కోట్లమంది పాఠకులు సమాచారాన్ని సేకరించగలుగుతున్నారు. అనేక భాషల్లో లక్షల కొద్దీ వ్యాసాలను వుంచడమంటే మాటలు కాదు. అందునా తక్కువ సిబ్బందితో. ఈ వికీపీడియా తెలుగులో కూడా ఉండడం గొప్ప విషయం. కానీ ఈ విషయం ఎక్కువ మందికి తెలియదు. ఈ వ్యాసం అందించిన కె.ఎక్స్. రాజుకు కృతజ్ఞతలు. మనలో మాట ఘనతంత్రం, కవితలు బాగున్నాయి.

టి. శ్రీరామమూర్తి, గాజువాక.

మరిన్ని వివరాలు

అరవయ్యేళ్లలో జరగాల్సినంత అభివృద్ధి జరగకపోవడానికి రాజకీయ ప్రతినిధులు, అధికారులే ప్రధాన కారణమని 'ఘన'తంత్రం ద్వారా మరో సారి గుర్తు చేశారు. పరిష్కరించలేని సమస్యలతో గందరగోళంగా తయారవుతున్న నేటి సమాజాన్ని సరైన క్రమంలో అమర్చగల శక్తి సామర్థ్యాలు రేపటి పౌరులైన నేటి బాలలకే ఉన్నాయి. నైతికత, మానవీయతలపై సరైన శిక్షణనిస్తే వారే రేపటి నిస్వార్థసేవా పౌరులవుతారు. కె.సాహిల్ సాహస బాలల వ్యాసం నేటి పిల్లలందరికీ అవసరమైనదీ, చదవాల్సింది. ఒక్కో సాహస బాలుడి గురించి ఇంకొంచెం వివరంగా ఇస్తే మరింత ప్రయోజనకరంగా వుండేది.

ఖైరి సత్యనారాయణ, కొత్తగూడెం.

కథ బాగుంది

'ప్రతిరోజూ సంక్రాంతే' కవితలో వాస్తవాన్ని హాస్యంతో జోడించి వివరించడం బాగుంది. వికీపీడియా గూర్చి కె.ఎక్స్. రాజుగారి వ్యాసం సరళంగానూ, సమన్వయంతోనూ, స్పష్టంగానూ ఉంది. 'అనామిక' కథ జరుగుతున్న వాస్తవంలాగుంది. అలాగే జరిగిన కథలా .... వింటున్న వాస్తవంలా ... మొత్తంమీద బాగుంది. అవసరానికి ఆడపిల్లలే ఆదుకుంటారనే నిజాన్ని రచయిత ఆదోని బాషా చక్కగా అక్షరీకరించారు. 'ఆదరిస్తే అద్భుతాలు' లోని ఆవేదన స్పందించదగినది. ఇంకా ఆడ-మగ మధ్య భేదాభిప్రాయాలతో ప్రవర్తించడం దురదృష్టకరం. 'స్నేహ'ని ఉన్నంతలో ఉపయుక్తంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్న ప్రచురణకర్తలకు ధన్యవాదాలు.

బి.ఎస్. ఖమ్మం.

ఆ రెండు వ్యాసాలు...

అనామిక కథ, 'వికాసం'లోని ఆదరిస్తే అద్భుతాలు వ్యాసం బాగున్నాయి. ఆడపిల్లలని చిన్నచూపు చూసేవాళ్లు నేటికీ ఉన్నారు. కానీ కన్నవాళ్లమీద వారికున్నంత ప్రేమ, ఆదరణ ఇంకెవరికీ వుండవు. కన్నవారిమీదే కాదు, ఎవరినైనా ఆదుకునే మనసు ఆడపిల్లకు ఉంటుంది. అది మర్చిపోయి వారిని చదివించడానికి, పెళ్లి చేయడానికి బోలెడు ఖర్చవుతుందని వారిని నిరాదరణకు గురిచేస్తున్నారు. వారిలో ఆత్మవిశ్వాసం నింపితే సాధించలేనిదంటూ లేదు. అట్టమీది కథ ద్వారా వికీపీడియా గురించి తెలియని ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. 'ఔరా...సాహస బాలలు' వ్యాసం పిల్లలను ఉత్తేజపరిచేలా వుంది. కవితలన్నీ బావున్నాయి.

విజయ్, గుంటూరు.



అలరించిన కోపెన్‌హాగెన్

కోపెన్ హాగెన్ వ్యాసం అలరించింది. ఎన్నో ద్వీపాల మధ్య వెలసిన ఈ నగరం గురించి, టివోలి గార్డెన్, జలకన్య శిల్పం, సిటీ హాల్ గురించిన విషయాలు చక్కగా తెలిపారు.

నూతి నారాయణ, గడ్డిఅన్నారం.

సాహసం హర్షణీయం

రాజకీయ నాయకులు కుతంత్ర వాదులు. దేశాన్ని దోచి సహస్ర కోటీశ్వరులవుతున్నారు. దేశాన్ని పంచుకుంటున్నారు. దేశం గర్వించదగ్గ చిన్నారులు 23మంది సాహసం చేయడం హర్షణీయం. కావూరి మాటల కోట కఠినంగా నడుస్తోంది.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

★

కవిత్వమ్

అవినీతి చంద్రికలు

దశదథుడి మూడు వరాల నాడే
నీతి సెలవంటూ నిష్క్రమించింది
గాంధారి గంతలు కట్టుకున్న నాడే
అధర్మం ఆవిష్కరణ జరిగింది!
పుత్రప్రేమ పితృప్రేమ
మాతృప్రేమ భాతృప్రేమ
సతిప్రేమ పతిప్రేమ
బంధుప్రేమ మిత్రప్రేమ
పెడదారులై ప్రేమలు
అవినీతికి రహదారులు
నీతిని మరచిన మనుషులు
అవినీతికి సహచరులు
మనిషిని కొలవడానికి
ఆస్తిని తూకం వేస్తున్నారు
ఆర్జితం నీతా? అవినీతా?
ప్రశ్నించడం మరుస్తున్నారు!
ఒకడి ఆస్తి ఆకాశం
ఒకడి ఆస్తి భూగోళం
ఒకడి ఆస్తి సప్తసముద్రాలు
ఒకడి ముందు వేలాదిమంది



కూలి చేస్తూ
కూలికి ఎదురుచూస్తూ
మజూరీకి ముంజేయి చాస్తూ
మొన్నటి నిరుద్యోగి
నేడు విశ్వధనపాలుడు
నిన్నటి చిరుద్యోగి
నేడు దేశ నిధినాథుడు!
అవినీతి అందలానికి
నీతి చంద్రికలు బోయీలు
అక్రమార్జనలకు
అవనీతి సోపానాలు!
చట్టసభలు ఒకడి సొంతం
శాసనాలు ఒకడి భుక్తం
న్యాయ స్థానం ఒకడి ఆధీనం
న్యాయం ఒకడి స్వాధీనం
పరిపాలన ఒకడి ఎత్తు
ఫలితం ఒకడి సొత్తు
కలంపోట్లు కలవారి పటాలాలు!
ఆక్సిజనే కలుషితమయ్యాక
కార్బన్ డయాక్సైడ్‌ను నిందించడం ఎందుకు
ప్రాణవాయువుకు ప్రాణం పోయడం తప్ప!

- అడిగోపుల వెంకటరత్నమ్

వలసపక్షి

కష్టం! ఓ వలసపక్షి
సుఖం మరిగిన....
ఇళ్ల చుట్టూ ఊడిగం చేస్తూ
ఇన్ని మెతుకులు ఏరుకుంటూ
ఏ చెట్టుకొమ్మకో
గూడు కట్టుకుంటుంది!

కష్టం!
బొగ్గు బాయిల్లో
సైరన్ మోతల్లో
ఇటుకల బట్టీల్లో
నెత్తురు చెమటగ మారుస్తూ
బుక్కెడు బువ్వను వెతుక్కుంటుంది!
గుడ్లగూబలు
కత్తుల్లాంటి గోళ్లతో
గూళ్లలో తలదాచుకున్న
దుఃఖాన్ని గాయం చేస్తూ....
శ్రమ ఫలితాల్ని
తన్నుకు పోతాయి!
వర్షం భీభత్సాలకు
మునిగిపోయిన పంటలకు
ఎగజల్లిన ఫైనాన్స్ ఎరువులు
పక్షి!
కాళ్లకు చుట్టుకుంటున్న
ముళ్ల పొదలవుతుంటే....
శక్తినంతా రెక్కల్లో నింపుకుని
కొత్త బతుకు కోసం....
ఎదురుచూస్తూ ఎగిరిపోతుంటే
వేటగాళ్లు!
ఎప్పటికప్పుడు
ఓట్ల గింజలు చల్లి
సంక్షేమ పథకాల ఉచ్చులు పన్ని
వలల్లో బంధిస్తున్నారు!
పండుగ పబ్బం గడుపుకుంటున్నారు!!

- రావుల పుల్లాచారి

నానీలు

అధ్యాపకులూ
రైతులే
మెదళ్ల బీళ్లలో
జ్ఞానాన్ని పండిస్తారు

ఇద్దరూ
బిచ్చగాళ్లే
ఒకడు ఓటుకోసం
మరొకడు సాపాటుకోసం

సముద్రం
నిశ్చల జలధి
మంచు సముద్రం
చంకలో సూది

వాక్యాల
దారాల నిండా
కవితాక్షరాలతో
ముత్యాల దండ

కొత్త సంవత్సరం
కొత్తేమీలేదు
సత్తు చెంబుకు
వెండిపూత

- ఉదారి నారాయణ



'నానీ'లే 'నానీ'లైన వేళ...

అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న వారు మన చుట్టపక్కాల్లో వుండడం కద్దు. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాల్లో బిజీగా వుంటారు. కెరీర్...కెరీర్ అంటూ ఎన్నాళ్లని పిల్లలను పోస్ట్‌పోన్ చేసుకుంటారు చెప్పండి. పిల్లల కేరింతలు, వాళ్ల అల్లరి చూడాలని ఎవరికి మాత్రం వుండదు. ఫలితంగానే ఆయా కుటుంబాల్లోకి చిన్నారి సభ్యులు వచ్చేస్తారు. మరి అటు ఉద్యోగాలు చేసుకుంటూ వీరి ఆలనాపాలనా చూడాలంటే కష్టం కదా. అప్పుడేం చేస్తారు? 'నానీ' లను ఆశ్రయిస్తారు. ఎవరీ నానీలు...ఏమా కథ! చదవండి మరి.

- కొండపల్లి నీహారిణి

యశోద మొదటిసారి అమెరికా వెళ్లడానికి కారణం తన పెద్ద కోడలు పురుడు పోసుకోవడమే! ఆరోజు కోడలు ఇంకా ఆఫీసు నుండి రాలేదు. చంటి పాపకు బాటిల్‌తో పాలు పడుతోంది. సరిగ్గా అప్పుడు కొడుకు ఉదయ్ తన ఫ్రెండ్సుని తీసుకుని వచ్చాడు.

అందులో ఒకావిడ యశోదను చూసి "ఆమె నానీయా?" అని ప్రశ్నించింది.

అందుకతను కంగారుగా..."అయ్యో కాదు కాదు, ఆవిడ మా అమ్మ" అని చెప్పాడు.

ఆ అమ్మాయి నాలుక్కరుచుకుని 'సారీ' అంది. 'అయామ్ వెరీ వెరీ సారీ' అని మళ్లీ అన్నది.

అప్పుడు 'పాప పడుకుంటుంది కదా. డిస్ట్రబ్ చేయొద్దని పరిచయం చేయలేదు' అంటూ ఉదయ్ ఆమె వైపు తిరిగి 'అమ్మా! ఈవిడ మా కొలీగ్, షీలా, ఇతను రఘువీర్, ఈవిడేమో వసంత' అంటూ పరిచయం చేశాడు.

కోడలు రావడం, వాళ్లంతా డిన్నర్ చేసి వెళ్లడం అన్నీ అయ్యాయి.

వాళ్లంతా వెళ్లాక 'ఏంట్రా ఏమంటుంది ఆ అమ్మాయి, సారీ ఎందుకు చెప్పింది?' అడిగింది యశోద.

ఉదయ్ మొహమాట పడుతూనే 'ఏం లేదమ్మా!. ఇక్కడ పిల్లల్ని చూచుకోడానికి ఎవరినైతే నియమిస్తారో వాళ్లని 'నానీ' అంటారు. నువ్వు ఇండియా నుండి వచ్చావని మా ఫ్రెండ్స్‌కు చెప్పినప్పుడు ఆమె వినలేదో ఏమో, నిన్ను చూసి నానీ అనుకుంది. నువ్వు మా అమ్మవని చెప్పగానే షీలా వెంటనే 'సారీ' చెప్పింది' అన్నాడు.

అప్పుడు యశోద మనసెందుకో కలుక్కుమంది. కానీ ఇప్పుడు ఇండియాలో కూడా 'నాయనమ్మ, నానమ్మ' అని పిలవడం తగ్గిపోయింది. 'నానీ' అనే అంటున్నారు. ఆమెకైతే ఆ 'నానీ'కి, ఈ 'నానీ'కి ఏమంత తేడా కనిపించలేదు.

***

యశోద కోడలు అనితకు నానీని పెట్టుకోవడం అస్సలు ఇష్టంలేదు. ఉదయ్ మాత్రం "ఏమౌతుంది? ఇక్కడి వాళ్లంతా పెట్టుకోడంలేదా?" అని వాదన. ఇద్దరి మాటలు విన్నాక నానీల గురించి పూర్తి సమాచారం సేకరించింది యశోద.

అచ్చమైన అమెరికన్లు కొందరు, అమెరికాలో స్థిరపడ్డ ఇతర దేశస్థుల ఆడవాళ్లు కొందరు 'నానీ'లుగా ఉద్యోగాలు చేస్తుంటారు. నానీలను ఏర్పాటుచేసే సంస్థలూ వుంటాయి. ఇళ్లలో పిల్లలను చూసుకోడానికి ఆ సంస్థల ద్వారా, కన్సల్టెంట్ల ద్వారా కుదురుతుంటారు. జీతం నెలకి వెయ్యి డాలర్ల నుండి వుంటుంది. దూరాలు, ప్రదేశాలు, ఆయా ప్రాంతాలను బట్టి పెద్ద మొత్తాల్లో ఉంటాయి. టైం ప్రకారం రావడం, వెళ్లడం వాళ్లదే బాధ్యత. పాప/బాబుకు పాలు

పట్టడం, తిండి పెట్టడం, స్నానం చేయించడం, మందులవీ పోయడం, అన్నింటి కంటే డైపర్లు మార్చడం వంటి పనులన్నీ చేస్తారు. కొందరైతే స్కూల్‌లో చేర్చిన మొదట్లో అంటే చిన్న వయసు పిల్లలనైతే స్కూల్‌కి తీసుకుపోవడం, తీసుకురావడం, హోంవర్క్‌లు చేయించడం వంటివన్నీ చేస్తారు. మరీ నెలల పాపాయి అయితే, పాప పడుకున్నాక గిన్నెలు కడగడం(డిష్‌వాషర్ పెట్టడం), బట్టలు వాషింగ్ మిషన్‌లో వేయడం, తీసి మడత పెట్టడం, ఇస్త్రీ చేయడం, ఇల్లు సర్దడం, శుభ్రం చేయడం వగైరా పనులు చూసుకుంటారు. ఇలా కాకుండా గంటకు ఇంతని 'అవర్లీ బేసిస్'న కూడా పనులు చేస్తారు. కొందరేమో మొత్తం పర్మినెంట్‌గా ఇంట్లోనే ఉండేవారూ కనిపిస్తారు. చాలా వరకు నానీలను లైసెన్స్ ఉన్నవాళ్లను పెట్టుకుంటే భద్రత విషయంలో ప్రశాంతంగా వుండొచ్చని కన్సంటెన్సీలపైనే ఆధారపడతారు. అందుకోసం ఇంటర్నెట్‌లో వెతుక్కుని సెలెక్ట్ చేసుకుంటారు. నెట్‌లో నానీలపై రివ్యూలు చూస్తారు. రికమండేషన్లనీ పరిగణిస్తారు. తొంభై శాతం తల్లిదండ్రులు ఇదే పద్ధతిని పాటిస్తారు. సంస్థద్వారా వెళ్తే ఖర్చు ఎక్కువ అవుతుంది అనుకుంటే మాత్రం... డైరెక్టుగా కాంటాక్ట్ చేసి కూడా పెట్టుకుంటారు. ఐ.డి ప్రూఫ్‌లు, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు, ట్రెనింగ్ సర్టిఫికెట్లు అన్నీ ఉంటాయి నానీలకు. సి.పి.ఆర్ సర్టిఫైడ్ వారే బెటర్. అంటే వీరు ఫస్ట్ ఎయిడ్ లాంటి విషయాల్లో కూడా శిక్షణ పొంది వుంటారు. పిల్లలకు చిన్న చిన్న ఆరోగ్య సమస్యలేమైనా వస్తే ప్రాథమిక చికిత్స చేసేవిధంగా శిక్షణ పొందిన

వారిని నానీలుగా తీసుకోడానికి ఇష్టపడతారు.

అంతే కాదు. ఇక్కడ రకరకాల కారణాల వల్ల అమెరికన్లు, అమెరికాలో స్థిరపడిన విదేశీయులు కూడా ఇలా నానీలపై ఆధారపడ్తారు. ఇదీ స్థూలంగా అమెరికాలో పనిచేసే వారి పరిస్థితి. ఇకపోతే మన భారతీయులు చాలా మంది ఇండియన్ నానీలపైనే ఆధారపడతారు. అదెలాగంటే చాలా ఏళ్ల క్రితం, అంటే ఎప్పుడో వచ్చి అమెరికాలో స్థిరపడిన గుజరాతీ, సిక్కు, తమిళ, తెలుగు వారిలో ఆడవాళ్లు, ఆఫీసుల్లో ఉద్యోగాలు చేయలేని వారు, ఏ బిజినెస్సూ లేనివారు చాలామంది ఇలా 'నానీ'లుగా పనిచేస్తున్నారు. వీళ్లలో కొందరు స్వంత కార్లలో వచ్చేవాళ్లున్నారు. కొందరినేమో తామే (నానీల అవసరమున్న కుటుంబాల వాళ్లు) వచ్చి కార్లలో తీసుకుని వెళ్లడం, తిరిగి సాయంత్రం దింపడం వంటివి చేస్తుంటారు. ఇందులో 'మన భారతీయతను నిలుపుకునే ప్రయత్నంలో భాగంగా కొంత, అమెరికా నానీలపై 'నమ్మకం' లేకపోవడం కొంత కారణాలుగా చెప్పొచ్చు.



అమెరికాలో ఇలా నానీలను పెట్టుకోవడం ఇష్టంలేకో, కష్టమయ్యో కొందరు తమ పిల్లల్ని 'డేకేర్' అనే బేబీకేర్ సెంటర్లకు పంపిస్తారు. పిల్లలకు పెట్టాల్సిన సమస్తం ప్యాక్ చేసుకుని వెళ్లి పాపను, వస్తువులను ఇవ్వడం, తిరిగి సాయంత్రం తీసుకు రావడం... ఇలా కొందరు చేస్తారు. కేవలం పిల్లల్ని మాత్రమే పంపించి తెచ్చుకోవడం, ఆహారంతో సహ అన్ని అవసరాలు డేకేర్ వాళ్లే చూడ్డం వంటి పద్ధతిని కొందరు అవలంభిస్తారు. డేకేర్ సెంటర్‌కు వెళ్లిన పిల్లలకు ఏ జలుబో, జ్వరమో వస్తే అవి ఇతర పిల్లలకి అంటుకుంటాయని రానివ్వరు. ఎప్పుడూ ప్యాక్ చేసినట్లుండే ఏసీ గదులు, కింద కార్పెట్‌తో ఉండే ఆ గదుల్లో బ్యాక్టీరియా తొందరగా పాకే అవకాశం ఉంది. ఒక రూమ్‌లో ఇంతేమంది పిల్లలు ఉండాలన్న నియమాన్ని డే కేర్ సెంటర్‌వాళ్లు పాటించాలి. పిల్లలకు జ్వరాలు వచ్చినప్పుడే తల్లిదండ్రులకు ఇబ్బంది. లీవులు పెట్టికుని మరీ చూసుకోవాలి. డేకేర్లన్నిటికీ మరో నియమం ఉంది. అదేంటంటే వర్షం రానీ, ఎండ ఎక్కువగా ఉండనీ, అతి చలి ఉండనీ, గాలులు వీచనీ, మంచు కురవనీ గాక... పిల్లలందరినీ ప్రతిరోజూ ఒక గంట ఆరుబయట పార్క్‌లో ఆటలాడించాలి. అది తప్పని సరి రూల్! ఎలాంటి వాతావరణ పరిస్థితులలో కూడా నిలదొక్కుకునేలా అలవాటు చేయడమన్నమాట! ఇలా చేయడం వల్ల బలహీనంగా ఉన్న పిల్లలు తొందరగా జబ్బు పడతారు. ఇది ఎవరికైనా తప్పదు.

కొన్ని డేకేర్ సెంటర్లలోనైతే వాళ్ల పిల్లలు ఏం చేస్తున్నదీ, ఎలా ఆడుకుంటున్నదీ అన్నీ కూడా ఎక్కడో ఆఫీసుల్లో ఉండే తల్లిదండ్రులు చూసుకునే విధంగా వాళ్ల కంప్యూటర్లలో కనిపించేలా కెమెరాలు ఏర్పాటు చేశారు. డే టు డే రిపోర్టు కూడా ఇస్తూ చాలా జాగ్రత్తగా చూసుకుంటారు. మంచి అలవాట్లు, పద్ధతులు, స్థాయికి తగ్గ చదువు... ఆటపాటలతో నేర్పిస్తారు.

***

అయితే యశోద మనసులో మాత్రం నానీలకు సంబంధించిన ఓ అనుమానం వేధిస్తూనే వుంది. "నానీలు పిల్లల్ని కొట్టడం, గిల్లడం, బెదిరించడం వంటివి చేస్తారటకదా. ఇండియాలో మన చుట్టాలనుకుంటుంటే విన్నాను" అనడిగింది కోడలిని.

"ఛ... ఛ... అలాంటిదేమీ ఉండదత్తయ్యా! నానీలు కూడా మనుషులే కదా. వారిలోనూ మానవత్వం ఉంటుంది. పైగా 'డ్యూటీ ఈజ్ గాడ్' అన్నట్లు పనులు చేసే అమెరికన్లు అలాంటి వేషాలు వేయరత్తయ్యా! అంతే కాదు ఎవరైనా వాళ్లమీద ఫిర్యాదు చేస్తే ఇక వాళ్ల జీవితంలో కోలుకోలేనంత శిక్ష, జరిమానా వుంటుంది. ఇక్కడి పోలీసు, రక్షణ వ్యవస్థ అంత కట్టుదిట్టంగా ఉంటుంది. ఎవరో ఒకరు, ఎక్కడో ఒకచోట అన్యాయం, దుర్మార్గం అనేవి చేస్తుంటారు. అక్కడక్కడ చెడు, దౌర్జన్యాలు ఉంటాయి. వాటివల్ల పిల్లలు, వారి తల్లిదండ్రులు బాధలు పడుతుంటారు. అది నిజమే కావచ్చు కానీ, ఎక్కడో ఒకటి జరిగితే దాన్ని అమెరికా మొత్తానికి రుద్దితే ఎలా అత్తయ్యా? అలా అయితే ఇండియాలో జరగట్లేదా?" అంది. "మీరు గానీ, మా అమ్మగానీ ఇక్కడే వుండి పిల్లల్ని చూసుకుంటే మంచిదని నా ఉద్దేశం. మన సంస్కృతి, సంప్రదాయాలు, భాషా పద్ధతులు... ఇలాంటివి మేమెంత చెప్పినా, పెద్దవాళ్లు మీరైతే బాగా చెప్తారనీ, వాళ్లని బాగా చూసుకుంటారని ఆశ. అంతే కాదు. మీరొచ్చి కొన్నాళ్లు ఇక్కడుండి పిల్లల్ని చూసుకోవడం వల్ల పిల్లలకీ, మీకు ఆటాచ్‌మెంట్ పెరుగుతుంది. అందుకే మిమ్మల్ని రమ్మంటున్నాం అత్తయ్యా! మీరు దాన్ని ఏదో మా పని కోసం పిలుస్తున్నామని అనుకోకండి" అంది.

"నిజమే కదా. ఎక్కడున్నా మనసులు కలిసి ఉండాలి" అనుకుంది యశోద.

"నేను మాత్రం నా మనవలు, మనవరాళ్ల చేత 'నానమ్మ' అనే పిలిపించుకుంటాను" అంటే యశోద కొడుకు, కోడలు పగలబడి నవ్వారు.

"అయితే ఇంకోసారి నన్ను చూసి నానీ అని ఎవరూ అనగూడదు" అంది ముందుగానే షరతు పెడుతున్నట్లు సరదాగా.

'సరే అత్తయ్యా... మీ ఇష్టం' అంది కోడలు భరోసాగా. ★



కంప్యూటర్‌తో దోస్తీ! గుండెకు సుస్తీ?!

"కొంతమంది యువకులు, నలభైకే వృద్ధులు" అని నేటి ఐటీ ఉద్యోగులపై తరచూ వినబడే జోక్. ఇది వాస్తవం కూడా! గంటల కొద్దీ కంప్యూటర్లతో కుస్తీ పడుతుండడం వల్ల అనేకానేక సమస్యలతోపాటు హృద్రోగ సమస్య కూడా ఎక్కువేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

విస్తృతంగా అభివృద్ధి చెందిన కంప్యూటర్ రంగంలో ఉద్యోగావకాశాలు, జీతభత్యాలు అంతేస్థాయిలో వుండడంతో ఈ రంగం యువతరాన్ని అమితంగా ఆకర్షించింది. ఇందులో ఎన్నో కష్టనష్టాలుండొచ్చు కానీ గడచిన దశాబ్దకాలంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం అంటే ఆ ఆకర్షణే వేరు. మధ్యతరగతి కుటుంబాలపై ఈ ప్రభావం చాలానే వుంది. ఎన్నో కుటుంబాలు నిలదొక్కుకోవడానికి, ఎందరో తల్లితండ్రులు కలలో కూడా ఊహించని విదేశీప్రయాణాలు, అమ్మలు, అమ్మమ్మలు కంప్యూటర్ల వాడకం, చాటింగ్ నేర్చుకోవడం తదితర పరిణామాలన్నిటికీ దాదాపుగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలే కారణం. అమెరికా, ఆస్ట్రేలియా, యుకె, జర్మనీ, చైనా వంటి దేశాల్లో రాష్ట్రానికి చెందినవారున్నారంటే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల ప్రభావమే ఎక్కువ. కోట్లకు పడగలెత్తిన విద్యావ్యాపారం కూడా దీని చలవే. ఇదంతా నాణేనికి ఒకవైపు మాత్రమే. దీనివెనుకనున్న మరో కోణం... స్ట్రెస్, యాంత్రికత, అనారోగ్యం.... ముఖ్యంగా కుటుంబ జీవితంపై ఈ వత్తిడి ప్రభావం అధికంగా వుంటోంది. కాలంతో పరుగెడుతూ, వేళకు తిండి, నిద్ర కరువై బతుకుతున్న వారి సంఖ్య లక్షల్లో వుంది. ఇటీవలి కాలంలో పెరిగిన ఇంటర్‌నెట్, సెల్‌ఫోన్ల వినియోగం కూడా ఉద్యోగంలో వత్తిడి పెంచుతోంది. ఆ విశేషాలు...

-కె.ఎక్స్.రాజు

ఇరవై నాలుగు గంటలూ కంప్యూటర్ ముందే కూర్చొని పనిచేసుకుపోయే యాంత్రిక జీవుల కష్టాలు అన్నీఇన్నీ కావు. పెద్దమొత్తంలో జీతభత్యాలు వస్తున్నాయన్న మాటేగాని కంప్యూటర్ ముందు నిరంతరం పనిచేసేవారికి ఊహించని బాధలు కూడా వున్నాయని వాపోవడం కద్దు. కంప్యూటర్ ముందు గంటల కొద్దీ పని చేసేవారికి ప్రత్యేకమైన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ సమయం కంప్యూటర్ ముందు గడిపేవారికి "కంప్యూటర్ స్ట్రెస్ ఇంజ్యూరి" లేదా "రిపిటీటివ్ స్ట్రెస్ ఇంజ్యూరీ" ఏర్పడతాయని, దీనినే పని సంబంధిత "అప్పర్ లింబ్ డిజార్డర్" అంటారని వైద్యులు చెపుతున్నారు. దీనికితోడు ఎక్కువ గంటలు కంప్యూటర్లపై పనిచేసినా, గంటలతరబడి టీవీకి అతుక్కుపోయినా గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా వున్నాని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. "యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ లండన్" నిర్వహించిన తాజా సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఎక్కువ సమయం టీవీలు చూసే వారికి, కంప్యూటర్లు వినియోగించే వారికి గుండెపోటు రావొచ్చని ఈ సంస్థ తన సర్వేలో తేల్చింది. రెండు గంటల కంటే తక్కువగా కంప్యూటర్లు ఉపయోగించే వారితో పోలిస్తే, రోజంతా టీవీలకు అతుక్కుని పోయే వారికి, గంటలకొద్దీ కంప్యూటర్ వినియోగించే వారికి గుండెపోటు వచ్చే అవకాశాలు 125 శాతం అధికంగా ఉన్నట్టు సర్వే నివేదికను ఉటంకిస్తూ "డైలీ ఎక్స్‌ప్రెస్" పత్రిక వెల్లడించింది. కంప్యూటర్ లేదా బుల్లితెరను తీక్షణంగా చూసే వారిలో వివిధ కారణాల వల్ల సంభవించే మరణాలు కూడా 48 శాతం ఎక్కువగా ఉన్నట్టు ఆ సర్వే వెల్లడించింది. నిరంతరం కంప్యూటర్లకు అతుక్కుపోయే వారు వ్యాయామాలు చేసినా శరీరానికి జరగాల్సిన నష్టం అప్పటికే జరిగిపోతుందని... అందువల్ల వ్యాయామాలు చేసినా పెద్ద ఫలితం ఉండక పోవచ్చని పేర్కొంది. ప్రధానంగా కంప్యూటర్ల ఎదుట సుదీర్ఘంగా కూర్చోవడం వల్ల గుండె జబ్బులను నిరోధించే లిపోప్రొటీన్ లైపేజ్ అనే ఎంజైమ్ ఉత్పత్తి 90 శాతం తగ్గుతుందన్నారు. ఈ ముప్పునుంచి కొంతమేరకైనా బయటపడాలంటే, ప్రతి 20 నిమిషాలకు ఓసారి స్వల్ప విరామం తీసుకోవడంతో పాటు కుర్చీలోంచి లేచి

నడవడం తప్పనిసరి.

సాధారణంగా కంప్యూటర్ ముందు నుండి లేచీ లేవగానే కళ్ళు ఎర్రబడి పోయి, చిరాకుగా, అసహనంగా కూడా ఉంటుంది. ఎందుకంటే నిరంతరం బుర్రతో పని చేయాల్సి రావటంతో మనసు తప్పకుండా అలసటకు గురవుతుంది. సిస్టమ్ ముందు నిరంతరం పని చేసేవారిలో ఎక్కువగా వచ్చే ఇబ్బందులు మెడ, మణికట్టు, వెన్నెముక స్టిఫ్‌గా అవడం, మెడలో, వెన్నులో నొప్పి, చికాకు, అనీజీనెస్, మూడ్ అప్‌సెట్ కావడం, మణికట్టులో నొప్పి, వేళ్ళు వంకర్లు తిరిగి నొప్పి పెట్టడం లాంటివి తలెత్తుతుంటాయి. కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లపై పనిచేసేటప్పుడు చుట్టూ అనేక కంప్యూటర్లు ఉంటాయి. ఈ కంప్యూటర్లన్నీ దగ్గర, దగ్గరగా ఉండటం వల్ల వీటిలోని విద్యుదయస్కాంత శక్తి మన ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపిస్తుంది. టైప్ చేసేటప్పుడు ల్యాప్‌టాప్, కంప్యూటర్లకు మన చేతులు 70 సెంటీమీటర్లు దూరంలో ఉండేలా చూసుకోవాలి. ఇలా చేసినప్పుడు మోనిటర్‌పై టెక్స్ చిన్నగా కనిపిస్తే సైజు పెంచుకోవడం మంచిది. చుట్టూ ఉండే మోనిటర్లను నాలుగు అడుగుల దూరంలో ఉండేలా చూసుకోవాలి. దీంతో విద్యుదయస్కాంత శక్తి తగ్గుతుంది. గర్భిణులు కంప్యూటర్లను వాడకపోవడమే మంచిది. అలాగే ల్యాప్‌టాప్‌లను ఒడిలో పెట్టుకుని వాడటం కూడా మంచిది కాదు.

కంప్యూటర్ ముందు కూర్చున్న ప్రతి ఒక్కరికి నడుంనొప్పి, వెన్ను నొప్పి రావడం చాలా సహజం. ల్యాప్‌టాప్‌తో ఎక్కువసేపు కూర్చుని పనిచేయడం వల్ల ఇలా వస్తుంది. సాధారణంగా పీసీని వాడేటప్పుడు వెన్నెముక, మెడను నిటారుగా ఉంచి పనిచేస్తాం. అదే ల్యాప్‌టాప్‌ను వాడేటప్పుడు మెడను కొద్దిగా కిందకి వంచి పనిచేయాల్సి ఉంటుంది. ఒకవేళ ల్యాప్‌టాప్‌ను టేబుల్‌పై ఉంచి పనిచేసినా కూడా కూర్చునే కుర్చీని మన ఎత్తుకు తగినదాన్ని ఎంచుకుని చేసుకోవాలి. లేకపోతే మెడ నొప్పి, స్పాండిలైటిస్‌ను భరించాల్సిందే. ప్రత్యేకంగా మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చిన స్టాండ్‌ల ద్వారా కానీ, టేబుళ్ల ద్వారా కానీ కంటిచూపుకు సమాంతరంగా తెరను అమర్చుకోవాలి. దీనివల్ల మెడ వంచాల్సిన అవసరం రాదు. ప్రతి అరగంటకోసారి ఐదు నిముషాలు రెస్ట్ తీసుకోవాలి. ఒక్కోసారి మెడనొప్పి వ్యాయామం కూడా తప్పనిసరి. అయితే ఈ వ్యాయామాన్ని ఫిజియోథెరపీ డాక్టరు సలహాతో చేస్తే మంచిది.

రాత్రి ఉద్యోగస్తులది మరో సమస్య. రాత్రులు ఉద్యోగ విధులు నిర్వర్తించడం వల్ల, అటువంటి ఉద్యోగులు కొంతకాలానికి మందకొడిగా తయారవుతారు. వారిలో జ్ఞాపకశక్తి తగ్గిపోతూ, మతిమరుపు ఏర్పడుతుంది. ఆలోచనాశక్తి, ఏ విషయంలోనయినా నిర్ణయం తీసుకునేశక్తిలో లోపం కలుగుతుంది. నిద్రపోవలసిన సమయంలో మేలుకొని ఉండటంవల్ల చికాకు, అసహనం, పరధ్యానంగా ఉండటం లాంటి లక్షణాలు వస్తాయి. నిద్రలేమి, బద్ధకం లాంటివి కలుగుతాయి. రాత్రి సమయంలో విధులు నిర్వహించవలసిన ఉద్యోగులు ఇబ్బందులు, సమస్యలకు గురికాకుండా ఉండాలంటే తమ జీవన విధానం మార్చుకోక తప్పదు. అంతేకాకుండా, ఆహారంలో కూడా మార్పు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

1. రాత్రి మేల్కొని డ్యూటీ చేయవలసిన ఉద్యోగులు, కాఫీ, స్ట్రాంగ్‌గా ఉండే టీలు రాత్రి సమయాల్లో ఎక్కువసార్లు తాగకూడదు. వాటిలో ఉండే కెఫిన్ శరీరంలోని స్ట్రెస్ హార్మోన్లను, అడ్రినలిన్ అనే హార్మోనును ప్రేరేపించడం వల్ల, వారి శరీరం త్వరగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. అటువంటి వారు తాజా కూరగాయల రసాలను కానీ, లెమన్‌టీని కానీ తాగవచ్చు. తేలికగా జీర్ణమయ్యే ఆహారపదార్థాలను తీసుకోవాలి.

2. రాత్రి ఎక్కువ సమయం నిద్రపోకుండా ఉంటారు కనుక పగటి సమయంలో కనీసం ఆరేడు గంటల సమయమన్నా ఆదమరచి నిద్రపోగలగాలి. అప్పుడే శరీరానికి తగిన విశ్రాంతి లభిస్తుంది.

3. నిద్రకు ఉపక్రమించే ముందు నిమ్మరసం లేదా తాజాపండ్ల రసంలో చక్కెరను కలుపుకుని తాగాలి. ఆకలిగా ఉంటే చక్కెర, కార్బోహైడ్రేట్లు లభించే పదార్థాలు తీసుకుంటే 'సెరటోనిన్' మెదడులో ఉత్పత్తి అవుతుంది. అది సుఖనిద్ర పట్టేందుకు తోడ్పడుతుంది.

4. నైట్ డ్యూటీ చేసేవారు ప్రొటీన్లు అధికంగా లభించే ఆహారపదార్థాలను తీసుకోవాలి. ప్రొటీన్లలోని అయినోయాసిడ్స్ మెదడుకు ఉత్తేజాన్ని, చురుకుదనాన్ని కలిగించి కొన్ని రసాయనాల ఉత్పత్తికి సాయపడతాయి. డోపమైన్, నార్పినెఫ్రెన్ లాంటి రసాయనాలు ఎక్కువ సమయం మెలకువగా ఉండేందుకు తోడ్పడతాయి.

5. పడక గది వాతావరణం తమకు అనుకూలంగా ఉండేలా చూసుకోవాలి. పిల్లల అల్లరి ధ్వనులు... టీవీ, రేడియోలలోని ప్రసారాలు, టెలిఫోన్, కాలింగ్‌బెల్ మోగే శబ్దాలు వారికి నిద్రాభంగం కలిగించకుండా జాగ్రత్త పడాలి.

6. నిద్రపోవలసిన సమయానికి విరుద్ధంగా, రాత్రి డ్యూటీవల్ల మెలకువగా ఉండటంతో వారిలో స్ట్రెస్ హార్మోన్లు ఉత్పత్తి అవుతాయి. వాటి చర్యలవల్ల వారిలో నిద్రతోపాటు శక్తికూడా తగ్గిపోతుంది. వారికి ఒత్తిడి ఏర్పడుతుంది. ఆ ఒత్తిడిని తొలగించుకోవటానికి ఎ,బి,సి, ఇ విటమిన్లు లభించే పదార్థాలను వారు తీసుకోవాలి. ఆహారపదార్థాల్లో ఉప్పు తగ్గించుకోవాలి.

7. సిస్టమ్‌కు, కళ్ళకు మధ్య దూరం అక్షరాలు స్పష్టంగా కనిపించేంత ఉండాలి. కంప్యూటర్ వెలుగు (స్క్రీన్ బ్రైట్ నెస్) 60 నుండి 70 దాకా ఉంటుంది. దానిని 30 నుండి 40 వరకు తగ్గించుకోవాలి. మధ్య, మధ్యలో సిస్టమ్ వైపు నుండి కళ్ళను పక్కకు మరలుస్తూ విరామం ఇవ్వాలి.

8. చీకటిగా ఉన్న రూమ్‌లో సిస్టమ్ ఉంచకూడదు. సినిమాలు, సీడీల వంటివి గదిలో తగినంత వెలుతురు లేకుండా చూడకూడదు.

9. డీహైడ్రేషన్ ఏర్పడకుండా మినరల్ వాటర్ లేదా గ్లూకోజ్ వాటర్.. మంచినీళ్ళు ఎక్కువగా తాగుతుండాలి. బాగా మూడ్ అప్‌సెట్ అయిపోయి, చికాకుగా ఉన్నప్పుడు కంప్యూటర్ ముందు నుండి కొద్ది నిమిషాలు తప్పుకోవాలి. లేదంటే ఇరిటేషన్, బ్లడ్ ప్రెషర్ రావచ్చు. కొన్ని జాగ్రత్తలతో కంప్యూటర్ కష్టాలను అధిగమించవచ్చు.

★



సీరియల్

జరిగినకథ:

ట్రాయ్‌ని ఉరితీసిన వార్త అందరికంటే చివరిగా కుయేన్ తల్లికి తెలుస్తుంది. ఆమె అమెరికన్ దురాక్రమణదారులను నోటికి వచ్చినట్టు తిట్టిపోస్తుంది. తర్వాత ఓ గుడి దగ్గర ట్రాయ్ కర్మకాండ ప్రారంభిస్తారు. దానికి అనేకమంది వస్తారు. పోలీసులు గమనిస్తున్నారని తెలిసి కూడా అంత మంది రావడం చూసి కుయేన్ ఆశ్చర్యపోతుంది. ట్రాయ్ విప్లవచర్యల్ని కొనియాడుతూ పాటలు పాడతారు. అతని కుటుంబసభ్యులు విప్లవంలో చేరి పోరాడేందుకు, ట్రాయ్ పేరుప్రతిష్ఠలు నిలబెట్టేందుకు ప్రోత్సహిస్తారు. ఆరోజు రాత్రి గుడి దగ్గరనుంచి ఆలస్యంగా ఇంటికి వస్తున్నప్పుడు ఎక్స్ సోదరి ఒక చిన్న పిల్లతో కుయేన్‌కు సందేశం పంపుతుంది. ఆ తర్వాత...

వియత్నాం వీరుడు ఎన్‌గుయెన్ వాన్‌ట్రాయ్

కథనం: **ఫాన్-థి-కుయేన్**

అనువాదం: **పాటూరి రామయ్య**

(ఇరవై ఒకటో భాగం)

'గత రాత్రి హానోయ్ రేడియో ఒక గీతం ప్రసారం చేసింది. మేమంతా విన్నాం. 'మేం ముందుకు వెళ్తాం' అన్న గీతం రచించిన కవి 'టోహూ' ఒక గీతాన్ని చదివాడు. మేము ఆ గీతాన్ని రికార్డు చేయలేకపోయాం. కాని దాన్ని సేకరించగలననే నమ్మకం నాకుంది. చాలామంది విద్యార్థులు నాకు తెలుసు. రచయిత 'టోహూ' విరచితాలైన గీతాలన్నీ వారు సేకరించగలరు.

'కవులూ, రచయితలూ ఉత్తేజిత పదజాలంతో ట్రాయ్‌ని శ్లాఘిస్తున్నారు. 'ఒక గొప్ప యువకుడు. హోచిమిన్ యుగంలో ఒక ధృవతార, వీరమరణం పొందిన అమరవీరుడు ట్రాయ్' ఇలా అనేక విధాలుగా కొనియాడుతున్నారు. నాకు తెలిసిన విద్యార్థులు 'మేము మరణిస్తే ట్రాయ్ వలెనే మరణిస్తాం.' అని శపథం తీసుకొన్నారు. వారి నోట్ పుస్తకాల మీద ట్రాయ్ ఫోటోను అంటించి పెట్టుకున్నారు. కొంతమంది విద్యార్థులు సినిమా బొమ్మలంతవి ఒక వంద ట్రాయ్ ఫోటోలు సేకరించారు. శిక్షితుల వార్డు నుంచి బైటకు వచ్చి చివరిసారిగా ట్రాయ్ సింహగర్జన చేసినప్పటి వరకూ ఆ ఫోటోలు ఉన్నాయి.

'ఒక మామూలు ఎలక్ట్రీషియన్ జీవితం కార్మికులకూ, విద్యార్థులకూ దివ్య తేజోమయంగా ఆదర్శప్రాయమైంది. చాలామంది సభలూ, సమావేశాలూ రహస్యంగా జరుపుతున్నారు. పత్రికల వాళ్ళు ట్రాయ్ చివరి రోజుల్లో తీసిన ఫొటోలను ఈ సభలూ, సమావేశాల్లో ప్రదర్శిస్తున్నారు. నగర మధ్య ప్రాంతంలోనూ, ఇంకా పలుచోట్ల చాలామంది దళాలు దళాలుగా కూడి ట్రాయ్ స్మారక స్థూపాలు ప్రతిష్ఠించడంలో విజయవంతమయ్యారు. డకావో బ్రిడ్జి చివర, రిపబ్లికన్ ఫుట్‌బాల్ గ్రౌండు ముందు ఆయన స్మారక స్థూపాలను ప్రతిష్ఠించారు. ఇంతెందుకు ఒక విషయం చెప్తే ఆశ్చర్యపోతావు. ఛిహోవా జైలులోపల కూడా స్మారక స్థూపం ఎత్తారు. ఆశ్చర్యంగా లేదూ! ఆ జైల్లో ఎలా పకడ్బందీగా కాపలా వుంచారో! నువ్వు చూశావుగదా. అక్కడ ఏ స్థంభానికైతే ట్రాయ్‌ని బంధించి కాల్చి చంపారో అక్కడ ఆయన స్మారక స్థూపాన్ని ప్రతిష్ఠించారు. ఒక యువజన దళం జైలు ప్రహరీ గోడ దూకి లోపలికెళ్ళి ఆ స్థూపాన్ని ఎత్తారు. అప్పుడు ఫొటో కూడా తీశారు. ఈ కథ విన్న చాలా మంది ఇది నిజమని నమ్మలేక పోతున్నారు.

'ఒక విప్లవీరుని గౌరవార్థం ఛిహోవా జైలు ఆవరణలో కాల్చిచంపిన చోటనే స్మారక స్థూపం ఎలా ప్రతిష్ఠించగలరు? ఈ విషయాన్ని పోలీసులు ధృవపరచడంతో అన్ని సందేహాలు తీరిపోయాయి: ఇలా చేయడం వలన ప్రజలలో భయోత్పాతం కలిగిస్తుందనీ, తత్ఫలితంగా ప్రజల మనో నిబ్బరాన్ని, ధైర్యాన్ని సడలగొట్టి పరిస్థితిని వారికనుకూలంగా మలచుకోవచ్చునని శత్రువులు భ్రమపడ్డారు. కానీ అది వాళ్ళకు ఉత్తభ్రమగానే మిగిలిపోయింది. మనం చేస్తోన్న ప్రతి చిన్న చర్య ఎన్నడూ లేనంత అనుకూల పరిస్థితులకు దారితీస్తుంది. ట్రాయ్‌ని చంపిన దుర్మార్గులపై పగ తీర్చుకునేందుకు అమెరికా దురాక్రమణ దారులను నాశనం చేయడానికి మన దళాల్లో ప్రతి సభ్యుడు వజ్ర సంకల్పుడై సిద్ధంగా ఉన్నాడు.

ఈ మధ్య కొత్తగా చేర్చుకొన్న ఒక దళానికి 'ఎన్ గుయెన్ వాన్ ట్రాయ్ దళం' అని పేరు పెట్టారు. మంచి ఫలితాలు వచ్చాయి. ట్రాయ్ విప్లవ కార్యకలాపాలు, ఆయన ఆశయం జైల్లో నీవు నాకు చెప్పిన అతని జీవితగాథ ప్రధాన చర్చనీయాంశాలుగా నా స్వంత దళంలో చర్చిస్తున్నారు.

ట్రాయ్ స్మృత్యర్థం గుడిలో కర్మకాండకు చెందిన కార్యక్రమాలు జరుగుతున్నాయని విన్న వెంటనే ఈ సందేశం పువ్వులూ ధూప దీపాలు తీసుకెళ్ళమని ఈ అమ్మాయికి చెప్పాను. నేను మళ్ళీ నీకు మరోసారి ఇలా తెలియజేస్తున్నాను :

'నీ భర్త ఆశయం, గౌరవ ప్రతిష్ఠలు రక్షించే మార్గాన జీవితం సాగించాలి. నావలన నీకెలాంటి సహాయం కావల్సి వున్నా అందివ్వగలను. తర్వాత నీకు చాలా ఉత్తరాలు పంపగలను. నీ మనశ్శాంతి కోసం కొన్ని విషయాలు తెలియజేస్తాను.

ఆ రోజు 25 తేదీ. శుద్ధ ద్వాదశి. మళ్ళీ నా భర్త సమాధి దర్శనం చేసుకున్నాను. ఇది ఎనిమిది లేక తొమ్మిదోసారి. ఇంతకుముందు మాదిరే పోలీసు కుక్కలు నా కాలి అడుగులు నాకుతూ వచ్చాయి. కాని నేను వాళ్ళనే మాత్రం లెక్క చేయలేదు. సమాధిపై పూలగుత్తులు ఉంచాను.

అగరవత్తులు వెలిగించాను. గౌరవ సూచకంగా సమాధి చుట్టూతా చాలాసేపు ప్రదక్షిణం చేశాను. ఆ పోలీసు ముష్కరులు వాళ్ళ కాళ్ళ మడమలు కొట్టుకున్నారు. కొంచెంసేపయ్యాక! పక్క గోరీ దగ్గరగా వెళ్ళి కూర్చున్నారు. వాళ్ళ నిఘా కొనసాగుతూనే ఉంది.

అలాంటి పరిస్థితుల్లో నా మనసులో ఏముందో ఆ భడవలకేం తెలుసు? ఆ మరుసటి రోజు నేను సైగాన్ వదిలి బయటకు వెళ్లాను. నా భర్త చివరిసారిగా విశ్రాంతి తీసుకున్న స్థలం అది. పోలీసు ముష్కరుల తీవ్ర నిఘాకు గురయ్యాను.

పట్టణంలోపలి విప్లవ కార్యకలాపాల్లో పాల్గొంటానికి నాకే మాత్రం సాధ్యం కాలేదు. నేను ఇలా నిర్ణయించుకొన్నాను.'రేపు విముక్తి మండలానికి వెళ్లాలి. శత్రువుపై పగతీర్చుకునేందుకు ఎలాంటి కఠిన నిబంధనలనైనా ఆమోదిస్తాను.'

శిక్షితుల వార్డులో మూడవ పర్యాయం ట్రాయ్‌ని చూచినప్పుడు ఆయన తుదిసారిగా చెప్పిన విషయం నెరవేర్చడానికి దృఢ సంకల్ప చిత్తనయ్యాను. ఆయన చెప్పిన అమూల్యమైన మాటలివి :

"మనం పరస్పరం దూరమైనప్పటికి ఎట్టి కఠిన పరిస్థితుల్లోనూ ఎప్పుడూ-శత్రువు మాయ ఉచ్చులో పడరాదు. విప్లవంలో చేరి పోరాడ్డానికి అన్ని విధాల ప్రయత్నించు. జైల్లో నీ సహచారిణుల ఉద్బోధ, వారు చూపించిన విప్లవాత్మకమైన మార్గం అనుసరించు."

(అయిపోయింది)

కొత్త పుస్తకాలు

ఉపయోగపడే పుస్తకం



తెలుగు ప్రజాతీర్పు 1952-2009
కొమ్మినేని శ్రీనివాసరావు, వెల:350/-, పేజీలు :312
ప్రతులకు : ప్రజాశక్తి అన్ని బ్రాంచీలు

ప్రముఖ పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాసరావు 'తెలుగు ప్రజాతీర్పు'ను మళ్ళీ వెలువరించారు. 2010 ఉప ఎన్నికల ఫలితాలతో సహా వెలువడిన ఈ పుస్తకాన్ని ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించింది. రచయితను పాఠకులకు ఎలా పరిచయం చేయనవసరం లేదో, ఆయన వెలువరించిన పుస్తకాన్నీ అంతే! ఎప్పటికప్పుడు తాజా సమాచారంతో పాఠకుల ముందుకు వచ్చే ఈ పుస్తకం రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని వారి ముందు ఆవిష్కరిస్తుంది. 1952లో జరిగిన తొలి శాసనసభ ఎన్నికల నుండి 2010 ఉప ఎన్నికల వరకు, నియోజకవర్గాల వారీగా విశ్లేషించారు. 1952 నుండి నియోజకవర్గాల స్వరూప, స్వభావాల్లో వచ్చిన మార్పులను ప్రస్తావించారు. ఆ క్రమంలో భాగంగానే 2009 శాసనసభ ఎన్నికలకు ముందు జరిగిన నియోజకవర్గాల పునర్విభజనతో చోటుచేసుకున్న మార్పులను తాజా పుస్తకంలో వివరించారు. రద్దయిన నియోజకవర్గాలకు సంబంధించిన సమాచారాన్ని, అక్కడ గతంలో జరిగిన ఎన్నికల ఫలితాలను అందించడం రాజకీయ విశ్లేషకులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. నియోజకవర్గాల వారీగా పునర్విభజనకు సంబంధించిన సమాచారాన్ని అందించడం స్థానికంగా చోటుచేసుకున్న మార్పులను అర్థం చేసుకోవడానికి దోహదపడుతుంది. పునర్విభజన అనంతరం నియోజకవర్గంలోకి కొత్తగా ఏయే ప్రాంతాలు వచ్చాయి, వేటిని తొలగించారు వంటి క్షేత్ర స్థాయి సమాచారాన్ని సైతం పొందుపరచడంలో కొమ్మినేని జాగ్రత్త చూపారు. దీనివల్ల ఈ పుస్తకాన్ని ఒక్కసారి చదివితే పునర్విభజన అనంతరం రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం కళ్ళముందు ఆవిష్కృతమవుతుంది. పుస్తక ప్రారంభంలో 'తెలుగు ప్రజాతీర్పు-పరిచయం' పేరుతో 2009 ఎన్నికల నుండి 1950వ సంవత్సరం వరకు రాష్ట్ర రాజకీయరంగాన్ని తనదైన శైలిలో కొమ్మినేని విశ్లేషించారు. 1952 నుండి 2009 ఎన్నికల వరకు లోక్‌సభ ఎన్నికల ఫలితాలను పుస్తకం చివరన ఇచ్చారు. రాజకీయరంగంపై ఆసక్తి ఉన్న ప్రతిఒక్కరికి ఈ పుస్తకం ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. రాజకీయ పరిశీలకులకు, పాత్రికేయులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

-వి. రాజగోపాల్

తెలుగుదనంతో "అమ్మ"

ప్రపంచ సాహిత్యంలో "అమ్మ" నవలతో పోల్చదగిన పుస్తకం మరొకటి లేదు. సరిహద్దు రేఖలను, తరతరాల అంతరాలను అధిగమించి దేశ దేశాల భిన్న కాల పాఠకులకు ప్రేరణగా నిలిచిన పుస్తకం అమ్మ.

సామాజిక మార్పుకు చోదకశక్తి అయిన కార్మికవర్గ ప్రాధాన్యతను గుర్తించడమే "అమ్మ" నవల గొప్పతనం. సామ్యవాద వాస్తవికతను ప్రపంచానికి చాటి చెప్పింది. మట్టినుంచే మాణిక్యాలను సృష్టించి నాయకత్వాన్ని ఇవ్వగలిగే దారిచూపింది. "అమ్మ" 1906లో తొలిసారి వెలువడిన నాటి నుంచి కోటానుకోట్ల ప్రతులు వెలువడుతూనే వున్నాయి. తెలుగునాట దాని ప్రభావం తక్కువైందేమీకాదు. సామాజిక చింతన కలిగిన ప్రతి పాఠకుడు తొలుత చదివే పుస్తకం "అమ్మే". మార్క్సిం గోర్కి ప్రఖ్యాత నవలకు నాటక రూపం ఇవ్వడం చిన్న విషయమేమీకాదు. ఆ సాహసాన్ని ప్రజానాట్యమండలి నాయకుడు వల్లమూడి నాగేశ్వరరావు చేయగలిగారు. నవలలో వున్న భావం చెడకుండా తెలుగుదనాన్ని జోడించడం వల్లమూడి గొప్పతనం. అమ్మ నవలలోని 13 ప్రధాన పాత్రలను, 3 ప్రదేశాలను ఎంపిక చేసుకొని ఈ నాటకాన్ని వల్లమూడి తయారుచేశారు. ఇందిరాగాంధీ ఎమర్జన్సీ పాలన సమయంలో విజయవాడలో ఈ నాటకాన్ని మొదటిసారి ప్రదర్శించారు. ఇప్పుడు దీన్ని పుస్తకరూపంగా సాహితీస్రవంతి ప్రచురించింది. 1970వ దశకంలో ఆంధ్రరాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, భూస్వాముల దౌర్జన్యాలు, పోలీసుల దాష్టీకాలు, కార్మికులు, కూలీల జీవితాలు, ప్రజల నమ్మకాలు జోడించడంవల్ల నాటకం రక్తికట్టింది. అమ్మ నవలను నేరుగా చదవాలనుకొని సమయం చాలక, సుదీర్ఘ వివరణలతో అలసిపోయేవారికి ఈ నాటకం చదవడంద్వారా అసలు అమ్మ నవలలోకి సులభంగా ప్రవేశించే మార్గం ఏర్పడుతుంది. అమ్మ నవలను గతంలో ఒక్కసారి చదివినా ఈ నాటకం చదివి మళ్ళీ అమ్మ నవలను చదవడం ద్వారా మరింత ఉత్తేజం పొందవచ్చు. తెలుగు పాఠకులు ఈ పుస్తకాన్ని తప్పక ఆదరించాలి.

"అమ్మ" నాటకం - నాటకీకరణ : వల్లమూడి నాగేశ్వరరావు, ప్రచురణ : సాహితీ స్రవంతి, వెల : 20/- ,పేజీలు:78, ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

-కారుసాల

నడుస్తున్న చరిత్రకు స్మృతి నిధులు

ప్రకృతి ఎలా పరిణామశీలమైందో మానవ స్వభావమూ అంతే! పరిసరాలు, పరిస్థితులు మారడంతో పాటు మానవుని భావాలు మారడం చూస్తాం. విశ్వరూపాన్ని గూర్చీ, సృష్టి స్వభావాన్ని గూర్చీ చెప్పబడుతున్న పురాతన భావాలను సాహస మేధావులు ఎదిరిస్తూ, శాస్త్రాలోచనా స్వాతంత్ర్యాన్ని నిరోధించేవారి ధూర్త దౌష్ట్య మూర్ఖత్వాల నెదిరిస్తూ, ప్రకృతి శక్తులను అర్థం చేసుకుని విజయాన్ని సాధించడంలో మానవుడు ముందంజ వేస్తూ వచ్చాడు. ఇది కాదనలేని సత్యం. ఆధునిక యుగానికి బాటను సుగమం చేసిన ఆ మధ్యయుగాల పునరుజ్జీవనం గురించి మైకేల్ ఇలిన్, ఇ.సెగల్ సంయుక్తంగా రాసిన గ్రంథానికి మహీధర జగన్మోహనరావు చేసిన తెలుగు అనువాద గ్రంథం 'జనులు - మహాజనులు'. ఆసక్తికరమైన విధంగా ఈ చారిత్రక విభాత సంధ్యల మానవ కథ వికాసాన్ని తెలిపే గ్రంథం ఇది. కడపటి రోమన్లతో మొదలిడి కోపర్నికస్ పర్యంతం పది ప్రకరణాలుగా రాయబడిన గ్రంథం ఇది. 'విశాలమవుతున్న ప్రపంచం మళ్ళీ సంకుచిత మైపోయింది' అన్న ఒకటో ప్రకరణంలోని అంశం, నాలుగో ప్రకరణంలోని 'బజారు నుంచి బజారుకు', ఆరో ప్రకరణంలోని 'సంపదలెట్లు ఉత్పత్తి చేయబడతాయి', ఏడో ప్రకరణంలోని 'భూగోళం పోటీదారుల క్రీడాకందుకం అవుతుంది', ఏడో ప్రకరణంలోని 'మానవుడు భవిష్యత్తులోనికి వీక్షిస్తాడు' మొదలయిన అంశాల అధ్యయనం వర్తమాన ప్రపంచంలోకి ముడివేసుకుని అవగాహన చేసుకుంటే మొట్ట మొదటి పేజీలోనే 'మానవుడు ద్రష్టయైనదెట్లు?' అన్నదానికి కొంతమేరకైనా సమాధానం లభిస్తుంది. శతాబ్దాల కిందట జీవించిన స్త్రీ పురుషులు ఈనాటి మన ఇరుగుపొరుగు మానవులుగా సజీవంగా చూపించే కథలే చరిత్ర. తెలుసుకోదగిన ఈ విషయాలన్నీ నడుస్తున్న చరిత్రకు స్మృతి నిధులు.

జనులు-మహాజనులు (మధ్యయుగాలు- పునరుజ్జీవనం), మైకేల్ ఇలిన్-ఇసెగల్, తెలుగు అనువాదం: మహీధర జగన్మోహనరావు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు. వెల: 100/-.

- సుధామ

నవ్వుల్ - పువ్వుల్

రాయనివి

తండ్రి: ఇవాళ పరీక్షల్లో మొత్తం ఎన్ని ప్రశ్నలు ఇచ్చారు?
పిల్లవాడు: పది నాన్నా.
తండ్రి: వాటిలో ఎన్ని వదిలేశావు?
పిల్లవాడు: మొదటి ఆరు, చివరి నాలుగు నాన్నా.

పెద్దయ్యాక...

టీచర్: రామూ పెద్దయ్యాక ఏమౌదామనుకుంటున్నావ్?
రాము: డెంటిస్ట్ టీచర్.
టీచర్: అదే ఎందుకని?
రాము: ఎవరికైనా 2 కళ్లు, ఒక ముక్కు, ఒక నాలుక, ఒక గుండె వుంటాయి. కానీ పళ్లు మాత్రం 32 వుంటాయికదా సార్.

సగం వాటా

(అతితెలివి వున్న ఇద్దరన్నదమ్ములు కలిసి వ్యాపారం చేస్తుంటారు. అందులో ఒకడు చివరి రోజుల్లో...)

అన్న: ఒరేయ్! తమ్ముడూ....నేను చనిపోయాక నా వాటా డబ్బు శవ పేటికలో పెడతావా! ఇదే నా చివరి కోరిక.
తమ్ముడు: అదెంతమాట అన్నయ్యా! నీ ఆఖరి కోరిక తీర్చలేని తమ్ముడిగా వుంటే ఎంత ? లేకపోతే ఎంత?

(తర్వాత అన్న చనిపోతాడు. అంత్యక్రియల రోజు...)
బంధువు: ఇదేంట్రా శవపేటికలో చెక్కు పెడుతున్నావు?
తమ్ముడు: తన మరణానంతరం సగం వాటా డబ్బు శవపేటికలో పెట్టమన్నాడ్రా అన్నయ్య. అందుకు.

రహస్యం

(ఓ మహిళ కుర్చీలో ఆరాంగా కూర్చున్న పెద్దాయన దగ్గరకెళుతుంది)

మహిళ: ఓ...తాతా! నువ్వు ఈ వయసులో కూడా ఇంత ఆరోగ్యంగా, సంతోషంగా వున్నావు? ఏంటి రహస్యం? చెప్పవా!
తాత: నేను రోజుకు అరడజను సిగరెట్ ప్యాకెట్లు కాలుస్తాను. పది బుడ్ల మందు లాగిస్తాను. కోళ్ళ, మేకలు లాగించేస్తాను. ఏనాడూ వ్యాయామం జోలికి పోలేదు.
మహిళ: అవునా! ఇంతకీ మీ వయసెంత?
తాత: పాతికేళ్లే...

శుభవార్త-దుర్వార్త

డాక్టర్: నీకు రెండు వార్తలు చెప్పాలయ్యా. ముందు ఏది చెప్పమంటావు?
రోగి: ముందు దుర్వార్త చెప్పండి డాక్టర్.
డాక్టర్: నీకు ఎయిడ్స్ వుందయ్యా.
రోగి: ఇప్పుడు మంచివార్త చెప్పండి డాక్టర్.
డాక్టర్: నీకు అల్జీమర్స్ (మతిమరుపు వ్యాధి) కూడా వుందయ్యా.
రోగి: పోన్లే డాక్టర్. నాకు ఎయిడ్స్ లేదు.
డాక్టర్: ఆ...

సంతోషకర సమయం

భార్య: ఏవండీ...20 ఏళ్ల కిందట...ఇక్కడ ఈ పార్కులో...ఈ బెంచీ మీదే మనం కూర్చుని మాట్లాడుకున్నాం. ఆరోజు మీరు 'నన్ను పెళ్లి చేసుకుంటావా' అనడిగారు. ఆ సంతోషంలో నాకు గంటసేపు నోట మాట రాలేదు. మీకు గుర్తుందా?
భర్త: నేను ఎలా మర్చిపోతాను డియర్. నా జీవితంలో అత్యంత సంతోషకర సమయం అదేకదా (ఆ తర్వాత నోరు మూతబడితే కదా).

నిద్ర

(రాంబాబు రోజూ ఆలస్యంగా ఆఫీసుకు వెళుతుంటాడు. అది బాస్‌కు నచ్చదు)

బాస్: ఇదిగో రాంబాబూ... నువ్వు ప్రతిరోజూ ఇలా ఆలస్యంగా వస్తే కుదరదు. నువ్వు ఏదైనా చేయి. ఆఫీసుకు మాత్రం టైమ్‌కి రా.

(రాంబాబు ఆ సాయంత్రమే ఓ డాక్టర్‌ని కలిసి మందులు తీసుకుని వేసుకొంటాడు. తర్వాత అలారం మోగాక లేచి టిఫిన్ చేసి ఆఫీసుకు వెళతాడు.)
రాంబాబు: సార్. ఇవాళ ఆఫీసుకు నేను ముందే వచ్చాను. నేను వేసుకొన్న మందులు పనిచేసినట్టున్నాయి.
బాస్: అవునా! నిన్న ఆఫీసులో కనిపించలేదు. ఏమయ్యావ్? ఆ...

1000 రూపాయలు

(ఓ మహిళ పర్సు పోగొట్టుకుంటుంది)

సంపత్ : మేడమ్! మీ పర్సు అక్కడ దొరికింది. తీసుకోండి.
మహిళ: ఓ..థ్యాంక్యూ! (హడావిడిగా తెరిచి చూసి)...ఇందులో 1000 రూపాయలుండాలైతే 100 రూపాయలే వున్నాయే.
సంపత్ : నిజమే మేడమ్. నాకు ఇది వరకు కూడా రెండు సార్లు పర్సు దొరికింది. వాళ్లకు తిరిగి ఇచ్చినా నాకు బహుమతి ఏమీ ఇవ్వలేదు.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్

జొన్నన్నం

కావలసిన పదార్థాలు

జొన్న నూక - అరకిలో

ఉప్పు - సరిపడినంత

తయారు చేసే పద్ధతి

జొన్న నూకను శుభ్రం చేసి ఉంచుకోవాలి. సరిపడినన్ని నీళ్లు పోసి గిన్నెలో మరిగించాలి. తర్వాత శుభ్రం చేసుకున్న జొన్న నూకను ఉండలు చుట్టుకుండా నెమ్మదిగా వేస్తూ కలుపుతూ ఉండాలి. తర్వాత ఉప్పు వేసి కలపాలి. నీరంతా ఇంకిపోయే వరకు సన్నటి సెగమీద ఉడకనివ్వాలి. దీన్ని పచ్చిపులుసుతో, పెరుగుతో తింటే బావుంటుంది.

పెసరట్ల కూర

కావలసిన పదార్థాలు

పెసరపప్పు - అరకిలో, అల్లం - చిన్న ముక్క

జీలకర్ర - 1 స్పూన్, పచ్చిమిర్చి - 5

ఉప్పు - సరిపడినంత, చింతపండు - కొద్దిగా

ఉల్లిగడ్డలు - 4, ఆవాలు - 1 స్పూన్

కొత్తిమీర - కొద్దిగా, కరివేపాకు - 2 రెమ్మలు

తయారు చేసే పద్ధతి

పెసరపప్పును గంట నానబెట్టి అట్టుపిండి రుబ్బుకోవాలి. ఆ పిండితో మందంగా అట్లు వేసి పక్కన పెట్టుకోవాలి. ఉల్లిగడ్డ, అల్లం, పచ్చిమిర్చి సన్నగా తరగాలి. ఆవాలు, జీలకర్ర పోపు చేసి అందులో ఉల్లిగడ్డ, అల్లం, పచ్చిమిర్చి ముక్కలు వేయాలి. కొంచెం చిక్కగా చేసిన చింతపండు పులుసు అందులో పోసి ఉప్పు, కరివేపాకు వేయాలి. చివరిగా పెసరట్లు ముక్కలు చేసి వేయాలి. బాగా మరిగాక దింపి కొత్తిమీర వేయాలి.



సజ్జ పోలెలు

కావలసిన పదార్థాలు

సజ్జపిండి - కిలో, సోంపు - 25 గ్రా

నువ్వులు - 25 గ్రా, గసాలు - 25 గ్రా

యాలకులు - 4, బెల్లం - అరకిలో

మంచి నూనె - వేయించడానికి సరిపడినంత

తయారు చేసే విధానం

బెల్లాన్ని మెత్తగా కొట్టి సరిపడినన్ని నీళ్లతో ముదురుపాకం పట్టాలి. అందులో సజ్జపిండి ఉండలు కట్టకుండా నెమ్మదిగా కలపాలి. అందులోనే గసాలు, సోంపు, నువ్వులు వేసి కలపాలి. పిండిని చిన్న ఉండలుగా చేసి పూరీల్లా వత్తాలి. వీటిని నూనెలో దోరగా వేయించాలి.



కొర్ర పాయసం (పాశం)

కావలసిన పదార్థాలు

కొర్ర బియ్యం - అరకిలో, పచ్చి కొబ్బరి తురుము - 25 గ్రా

బెల్లం - 400 గ్రా, సోంపు - తగినంత

యాలకులు - 4, జీడిపప్పు ముక్కలు - 2 స్పూన్లు

కిస్‌మిస్ - 2 స్పూన్లు, నెయ్యి - 3 టేబుల్ స్పూన్లు

తయారు చేసే విధానం

శుభ్రం చేసిన కొర్రబియ్యాన్ని బాగా కడిగి నానబెట్టాలి. పాయసం వండడానికి సరిపడినన్ని నీళ్లని బాగా మరిగించాలి. అందులో నానిన బియ్యాన్ని వేసి కొద్దిగా ఉడకనివ్వాలి. తర్వాత బెల్లం వేసి మరికొంతసేపు ఉడకనివ్వాలి. చివరిలో సోంపు, యాలకులు, వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్, నెయ్యి వేసి కలిపి రెండు నిమిషాలు ఉడకనిస్తే చాలు. కొర్ర పాయసం రెడీ.

చూద్దామా

విక్టోరియా మ్యూజియం



సుమారు వందేళ్ల కిందటి మాట. గుంటూరు జిల్లా అమరావతి ప్రాంత జమిందారు ఒకరు ఆ ప్రదేశంలో బయల్పడిన బౌద్ధ ఆలయాల శిథిలాల తాలూకు పాలరాతి ముక్కలను, విగ్రహాలను పొడిగా చేసి తన భవన నిర్మాణం సందర్భంగా సున్నంలో కలుపుకున్నారని చెబుతారు. వాటిని చూసి బాధపడిన ఆనాటి ఆంగ్లేయ అధికారులు అమరావతిలోని కొన్ని అపురూప విగ్రహాలను లండన్ మ్యూజియంకు తరలించారట.

మన దేశంలో సంపదను కొల్లగొట్టి, ప్రజలను నానావిధాల హింసించిన ఆంగ్లేయులు తమకు లేని, తెలియని గొప్ప చరిత్ర, సంస్కృతి ఇక్కడ వృద్ధి చెందిన విషయం తెలుసుకుని అబ్బురపడ్డారు. పురాతన చరిత్రకు సంబంధించిన శిథిలాల రక్షణ పట్ల ఆసక్తి కనబరిచారు. ఇంగ్లండ్‌లో మాదిరిగా మన దేశంలో కూడా పురాతన వస్తు ప్రదర్శన శాలలు ఏర్పాటు చేశారు. 1887లో విక్టోరియా మహారాణి పాలనా కాలంలో విజయవాడ బందరు రోడ్డులో ఆ విధంగానే విక్టోరియా జూబ్లీ ప్రదర్శన శాల ఏర్పాటయింది.

ప్రస్తుతం మ్యూజియం ప్రాంగణంలోకి అడుగుపెడితే ఒక పురాతన ప్రాంతానికి వెళ్లిన అనుభూతి కలుగుతుంది. మ్యూజియంలో కనిపించే ప్రతి వస్తువు వెనుక వందల, వేల సంవత్సరాల చరిత్ర నిక్షిప్తమై ఉంది. అది కుండపెంకు కావచ్చు. గాజు ముక్క కావచ్చు. రాష్ట్రంలోను, పొరుగు రాష్ట్రమైన కర్నాటకలోను బయటపడిన ఆదిమానవుడు ఉపయోగించిన అనేక వస్తువులు అక్కడ దర్శనమిస్తాయి. లోపలకు వెళ్లగానే ఎడమవైపున అడుగు ఎత్తున ఉన్న ఒక రాతి బొమ్మ కనిపిస్తుంది. 'మాతృదేవత' అని పిలవబడే ఆ దేవతామూర్తి బొమ్మ గుంటూరు జిల్లా ఏట్రవారిపాలెంలో దొరికింది. అది క్రీస్తుశకం 1, 2 శతాబ్దాల నాటిదని తెలుస్తుంది. ప్రస్తుతం ఉనికిలోవున్న పురుషాధిక్య సమాజానికి ముందు, తొలి రోజుల్లో ఇక్కడ మాతృస్వామ్య వ్యవస్థ అమల్లో ఉండేదని ఆ విగ్రహం ద్వారా తెలుస్తోంది. మాతృస్థానం పట్ల ఆనాడు అపరిమితమైన గౌరవం, భక్తి వుండేవి. పూజలు కూడా చేసేవారు. ఈ విధంగానే ఈ విగ్రహం రూపొందిందని భావన. ఇది తయారైన కాలంలో ఆంధ్రదేశంలో శాతవాహనరాజులు పాలన చేసేవారు. బౌద్ధమతావలంబీకులైన వారు కూడా మాతృమూర్తులకు ఆ విధమైన గౌరవం ఇచ్చేవారనడానికి వారి పేర్లే ఉదాహరణ. శాతవాహన రాజుల పేర్ల ముందు వారి తల్లుల పేర్లు వుండేవి. ఉదాహరణకు గౌతమీపుత్ర శాతకర్ణి, యజ్ఞశ్రీ శాతకర్ణి.

మన దేశంలో సంపదను కొల్లగొట్టి, ప్రజలను నానావిధాల హింసించిన ఆంగ్లేయులు తమకు లేని, తెలియని గొప్ప చరిత్ర, సంస్కృతి ఇక్కడ వృద్ధి చెందిన విషయం తెలుసుకుని అబ్బురపడ్డారు. పురాతన చరిత్రకు సంబంధించిన శిథిలాల రక్షణ పట్ల ఆసక్తి కనబరిచారు. ఇంగ్లండ్‌లో మాదిరిగా మన దేశంలో కూడా పురాతన వస్తు ప్రదర్శన శాలలు ఏర్పాటు చేశారు. 1887లో విక్టోరియా మహారాణి పాలనా కాలంలో విజయవాడ బందరు రోడ్డులో ఆ విధంగానే విక్టోరియా జూబ్లీ ప్రదర్శన శాల ఏర్పాటయింది.

మాతృస్థానానికి పూజ చేసే ఆచారం ఆంధ్రరాష్ట్రంలో అతి ప్రాచీనమైన ఆదిమానవుడి అవశేషాలు బయల్పడిన కర్నూలు జిల్లా నల్లమల అడవుల్లోని ఆలంపురంలో ఇప్పటికీ కొనసాగుతోంది. ఇలా ప్రతి బొమ్మ వెనుక, ప్రతి వస్తువు వెనుక ఎంతో చరిత్ర దాగి ఉంది. అదేవిధంగా కృష్ణాజిల్లా తెన్నేరులో దొరికిన "మట్టి శవపేటిక" క్రీస్తుపూర్వం ఐదవ శతాబ్ది నాటిదని భావిస్తున్నారు. ఇది 1970వ సంవత్సరంలో ఆ గ్రామంలో బయల్పడింది. ఆరు అడుగుల పొడవు, రెండడుగుల వెడల్పు గల శవపేటిక ఆకారం, నిర్మాణం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఉత్తర భారతదేశంలో బౌద్ధ, జైన మతాలు మొగ్గతొడుగుతున్న కాలంలో దక్షిణ భారతదేశంలో ద్రావిడ సంస్కృతి ఎలా ఉందో అధ్యయనం చేయడానికి ఈ శవపేటిక ఉపయోగపడుతుంది. ఆనాటి మతపరమైన ఆచారాలు, కర్మకాండలు తదితర విషయాల గురించి పరిశోధన జరుగుతోంది. మట్టిపాత్రలు, కుండపెంకులు, దంతపు ముక్కలు, రాతి ముక్కలు ఏవీ ఆకర్షణీయంగా కనిపించకపోయినా వాటి వెనుక చరిత్ర ఆసక్తిగా వుంటుంది. అవే గాక ఎన్నెన్నో కళాచిత్రాలు, శాసన లిపి పలకలు, రాతప్రతులు, కూడా ఇక్కడ వున్నాయి. క్రీస్తుపూర్వం, ఆ తర్వాత శతాబ్దాల్లో రాజులు, జమిందార్లు వాడిన వివిధ వస్తువులు, కత్తులు, కటార్లు, డాలులు, శూలాలు, అంబులు, తుపాకులు, తాళపత్ర గ్రంథాలు, కలంకారీ చిత్రాలు, పురాతన నాణేలు ఇక్కడవున్నాయి. విక్టోరియా రాజ్యాధిపత్య రజతోత్సవ సందర్భంగా 1887 జూన్ 20న అప్పటి కృష్ణాజిల్లా కలెక్టర్ రాబర్ట్ శీవెల్ ఆధ్వర్యాన ఈ మ్యూజియం స్థాపించారు. ఈ తర్వాత కొంతకాలం వరకు ఎదుగూ బొదుగూ లేకుండా పడివున్న ఈ మ్యూజియంను నూజివీడు సంస్థానం జమిందార్లు కొంతవరకు అభివృద్ధి చేశారు. దీంతో మ్యూజియంకు ఒక రూపు ఏర్పడింది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ వివిధ ప్రాంతాల నుండి పలు పురాతన వస్తువులు సేకరించి, ఇక్కడ ప్రదర్శనకు ఉంచారు. స్వాతంత్ర్యానంతరం 1962 వరకు ఇది మళ్లీ ఎటువంటి అభివృద్ధికీ నోచుకోలేదు. 1962లో దీన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పురావస్తు ప్రదర్శనశాలల పరిధిలోకి తెచ్చారు. యాదృచ్ఛికంగా నూజివీడు జమిందారీ వంశీయుడైన ఎం.ఆర్.అప్పారావు అప్పుడు రాష్ట్ర పురావస్తు శాఖామాత్యులుగా వున్నారు. అనంతరం క్రమంగా అప్పటి నుండి ఇప్పటి వరకు మ్యూజియాన్ని పలు విధాలుగా అభివృద్ధి చేశారు. అనేక శిల్పాలు, పురావస్తు సముదాయాలు సేకరించారు. బౌద్ధకళామందిరాన్ని నిర్మించారు. మ్యూజియంలోని పార్కులో శిల్ప విభాగాన్ని ఏర్పాటు చేశారు.

వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 1988 మార్చిలో మ్యూజియం శతవార్షికోత్సవాలు జరిపారు. 1991 ఫిబ్రవరిలో మ్యూజియం డైరెక్టర్ల జాతీయ సదస్సు ఇక్కడే జరిగింది. అంతకుముందు సరైన ప్రచారం లేక అంతగా ప్రజాదరణకు నోచుకోని ఈ మ్యూజియం అప్పటి నుండి సందర్శకులను ఆకర్షిస్తోంది.

- ఎం. సాంబశివరావు

హిమాలయాల నడుమ ఎడారి 'లెహ్'

జమ్మూకాశ్మీర్ రాష్ట్రం మొత్తం విహారానికి అనువైన ప్రదేశమే అంటారు అనుభవజ్ఞులైన యాత్రికులు. ఎన్నిసార్లు వెళ్లినా మళ్లీ మళ్లీ రమ్మనేట్టు రమణీయంగా ఉంటాయక్కడి ప్రకృతి అందాలు. అంతటి రమ్యమైన ప్రదేశంలో కొలువైన చిన్ని ప్రదేశం 'లెహ్'.



'లెహ్' స్వాగత ద్వారం

లెహ్ లడక్‌లోని ముఖ్యమైన పట్టణం. పూర్వం లెహ్ ప్రాంతం టిబెట్, కాశ్మీర్ మధ్య అతి ముఖ్యమైన వ్యాపార కూడలిగా ఉండేది. క్రమేపీ దాని ప్రాముఖ్యత తగ్గి, చైనాతో యుద్ధం తర్వాత 1962లో సరిహద్దు మూసివేయడంతో వ్యాపారం ఆగిపోయింది. కానీ మనాలి - లెహ్ రహదారి అభివృద్ధి చెందడంతో మళ్లీ లెహ్ పట్టణం టూరిస్టులని ఆకర్షించడం మొదలయింది. దాంతో మళ్లీ కాశ్మీర్ వ్యాపారస్తులు తీరిక లేకుండా మారారు.

మేము హిమాచల్‌లోని మనాలి నుండి లెహ్‌కి ప్రయాణమయ్యాం. శ్రీనగర్ నుండి కూడా లెహ్ చేరవచ్చు. మనాలి నుండి లెహ్‌కి బస్సు, టెంపో వంటి రవాణా సౌకర్యాలు ఉన్నాయి. మా ప్రయాణం బస్సులో. మనాలి - లెహ్ రహదారికి ఇరుపక్కల ఉన్న ప్రకృతి సౌందర్యాన్ని చూసి ఆనందించాల్సిందే తప్ప వర్ణించడానికి వీలు లేనంత అద్భుతమైనది. ఈ రహదారి ఏడాదిలో కొద్ది రోజుల పాటే తెరిచి ఉంటుంది (జులై15 నుండి సెప్టెంబర్15 వరకు). వేసవి తర్వాత రహదారి మొత్తాన్ని దట్టమైన మంచు కప్పేస్తుంది. దారిలో అనేక చోట్ల రోడ్డుమీద సురక్షిత ప్రయాణాన్ని గుర్తు చేస్తూ సైన్ బోర్డులు ఏర్పాటు చేశారు. వాటిలో కొన్ని సరదాగా ఉన్నాయి..."నా వంపులని ఆనందించు, పరీక్షించకు", "ఇఫ్ యు స్లీప్, యువర్ ఫ్యామిలీ విల్ వీప్".

ప్రపంచంలోకెల్లా అతి ఎత్తైన, మోటార్లు వెళ్లగలిగే రోడ్డు మార్గాలలో ఒకటైన తగ్లంగ్ లా ఈ దారిలోనే ఉంది. అత్యంత ఎత్తైన మార్గం ఖర్దుంగ్లా పాస్ కూడా లడక్‌లోనే వుంది. మనాలి వైపు నుండి చూస్తే 'ఉప్షి' అనే ప్రదేశం లెహ్‌కి ముఖద్వారంగా కనిపిస్తుంది. ఇక్కడే, భారత సైన్యం నిర్మించి, నిర్వహించే రహదారి ముగుస్తుంది. ఏమాత్రం సహకరించని హిమాలయాల్లో రోడ్లు నిర్మించడం ఆషామాషీ కాదు. ప్రాజెక్ట్ హిమాంక్ అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది. అక్కడ ఒక బోర్డ్ మీద 'చంద్రుని పైకి మార్గం కావాలంటే, హిమాంక్‌ని సంప్రదించండి' అని ఉంది. ఉప్షి నుండి లెహ్ నలభై కిలో మీటర్లు. ఈ మార్గంలో అనేక పల్లెలు, గొంపాలు (బౌద్ధుల ఆశ్రమాలు) ఉన్నాయి.

సుమారు పదహారు గంటల ప్రయాణం తర్వాత రాత్రి ఎనిమిది గంటల సమయంలో మేం లెహ్ చేరాం. లెహ్ చిన్న పట్టణం. కానీ సముద్ర మట్టానికి సుమారు 3555 మీటర్ల ఎత్తులో ఉండడం వల్ల మొదట్లో కొన్ని రోజులు తలనొప్పి, తల తిరగడం, ముక్కు మూసుకుపోవడం, ఊపిరి కష్టమవడం, ముక్కు నుండి రక్తం కారడం వంటి కొన్ని ఇబ్బందులు సహజమే. వీటికి విరుగుడు వీలైనంత విశ్రాంతి. అక్కడ అన్ని చోట్ల ఉన్నట్లుగానే హోటల్ చూపిస్తామంటూ అనేకమంది వెంటపడుతుంటారు. కానీ మేం ముందే ఒక గెస్ట్‌హౌస్ బుక్ చేసుకున్నాం. ఆ రాత్రి విశ్రాంతి తీసుకుని ప్రయాణ బడలిక తీర్చుకున్నాం.

మరుసటి ఉదయం లెహ్ పట్టణ దృశ్యాన్ని చూశాం. అయితే మేము ఊహించినట్టు అందమైన లోయలాగా అనిపించలేదు. కొన్ని గోధుమరంగు కొండలు, కొన్ని మంచు కొండలు చుట్టూరా ఉన్నాయి. హిమాలయాల నడుమ లెహ్ ఒక చిన్న

ఎడారిలా తోచింది. టిబెటియన్ పద్ధతిలో కట్టిన, ప్రస్తుతం శిధిలావస్థలో ఉన్న ఒక రాజమహల్ లెహ్‌కి రక్షణగా ఉన్నట్టుగా అనిపించింది. ఆ ఎగుడు దిగుళ్లలో అటూ ఇటూ నడుస్తున్న జనంతో లెహ్ బిజీగా కనిపించింది. గెస్ట్‌హౌస్‌కి దగ్గర్లో 'మార్కెట్ ప్లేస్' ఉంది. ప్రతి విహార యాత్రాస్థలంలో లాగే అక్కడా అనేక చిన్న చిన్న దుకాణాలు కనిపించాయి. తినుబండారాల నుండి జ్ఞాపికల వరకు అక్కడ అమ్ముతుంటారు. ఇక్కడ 'యాప్రికోట్' పళ్లు చాలా బావున్నాయి. అయితే ఇక్కడి వాతావరణం చాలా పొడిగా ఉండడం, పైగా వేడి అధికంగా ఉండడంతో కాస్త ఇబ్బంది పడ్డాం. చలువ కళ్లద్దాలు, మాయిశ్చరైజింగ్ క్రీములు, టోపీలు పగటిపూట అవసరం. రాత్రుళ్లు చాలా చలి కాబట్టి అందుకు వీలైన దుస్తులు కూడా అవసరం. లెహ్‌లో (ఆ మాటకొస్తే ఈ ప్రాంతంలో) టీ ఎక్కువ తాగుతారు. కానీ ఆ టీ మన టీలా వుండదు. చేదుగా, ఘాటుగా, పసరులా ఉండి మనకి అంతగా నచ్చకపోవచ్చు.

లెహ్ ఒక్కటే కాదు, అసలు మొత్తం లడక్ కూడా ట్రెక్కింగ్‌కి ప్రసిద్ధి. విదేశీ టూరిస్టులు వీపుకు 'బ్యాక్ ప్యాక్' తగిలించుకుని ఎక్కడ పడితే అక్కడ కనిపిస్తుంటారు. మార్కెట్ ప్లేస్‌కి దగ్గరలో శాంతి స్థూపం ఉంది. అది తెల్లని గోపురంతో అందంగా కనిపిస్తుంది. నిజానికది ఒక బౌద్ధ ఆశ్రమం. ఇక్కడి నుండి లెహ్ పట్టణం మొత్తం చూడొచ్చు. ఇక్కడి సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు అద్భుతంగా ఉంటాయట. సమయాభావం వల్ల మాకు అవి చూసే వీలు లేకపోయింది. దీనికి సమీపంలోనే లెహ్ ప్యాలెస్ ఉంది. లెహ్ లోయలో నుండి అందమైన సింధునది ప్రవహిస్తుంది. హేమిస్, షే, తిక్సి వంటి ప్రదేశాలు ఎక్కువగా యాత్రికులని ఆకర్షిస్తాయి. ఈ ఆశ్రమాల్లో ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తుంది. గంటలు, మంత్రోచ్చారణలు, భారీ బుద్ధుని విగ్రహాలు ఒక కొత్త లోకాన్ని ఆవిష్కరిస్తాయి. పదిహేడవ శతాబ్దంలో నిర్మించిన హేమిస్ గొంప లెహ్‌లో ఉన్న ఆశ్రమాల్లోకెల్లా పెద్దది. ఈ ఆశ్రమాల్లో చాలా వరకు ఎత్తైన కొండలపై ఉండడం వల్ల అక్కడికి నడుచుకుంటూ వెళ్లాలి. కాబట్టి శారీరకంగా పటిష్టంగా ఉంటేనే అది సాధ్యం. మాలో కొంతమంది ఎక్కలేకపోయారు.

కొండలెక్కడం ఇష్టం ఉన్న వారికీ, ఎత్తైన ప్రదేశాల వాతావరణంలో ఇమడగలవారికీ, శారీరక దారుఢ్యం గలవారికీ లెహ్ నచ్చుతుంది. కానీ లెహ్ వరకూ ప్రయాణం, దారిలో వచ్చే కొక్సర్, రోహతంగ్ వంటి ప్రదేశాలు బావున్నాయి.

మా తిరుగు ప్రయాణం మాత్రం ఒక చేదు అనుభవం. ఎక్కడ ఏభాగం ఊడి పడిపోతుందో అన్నట్టున్న బస్సు. బయట విపరీతమైన చలి కారణంగా కిటికీలన్నీ మూసివేశాం. లోపల ఎవరో 'యాక్' పాలు తీసుకెళ్తున్నారు కాబోలు ఒకటే వాసన. పైగా ఇంకెవరో వాంతి చేసుకున్నారు. అది దుర్భరమైన ప్రయాణం. టాక్సీలో వస్తే బావుండనిపించింది. మళ్లీ మనాలి చేరిన తర్వాత గానీ ప్రశాంతంగా ఊపిరి పీల్చుకోలేకపోయాం.

-డా॥కాకర్లమూడి విజయ్

నవరసాల బాటసారి

'పద్మ' తేజం

కాస్త వంగి నడవడం..
'లతా.. రాధా..' అని ప్రేమగా పిలిచినా 'అమ్మా..' అని బరువుగా పిలిచినా ఆ
కాస్తలోనే విరుపూ మాటలోనూ మనిషిలోనూ
శాలువా కప్పుకుని బరువుగా నడవడం
వేలు పైకి లేపి మాట్లాడ్డం
అర్ధవంతమైన ఆక్షేపణీయమైన రీతిలో బిగ్గరగా నవ్వడం
ఆడవాళ్లకన్నా నాజూగ్గా కనిపించాలని ప్రయత్నించడం
కళ్లు పైకి కిందికీ తిప్పుతూ ఎదుటి వాళ్లను శల్య పరీక్ష చేయడం
తెలుగు వారికి చిరపరిచితమైన ఈ లక్షణాలన్నీ ఎవరివో మళ్లీ చెప్పాలా?

- తె.ర

అక్కినేని నాగేశ్వరరావుకు పద్మ విభూషణ్ పురస్కారం ప్రకటించడం తెలుగు వాళ్ల ఎవరికీ పెద్ద వార్తగా కనిపించదు. ఎందుకంటే ఆయన కొన్ని తరాలను అలరించిన ప్రజా హృదయ విజేత. తొమ్మిది పదులు చేరువవుతున్నా ఇప్పటికీ దసరా బుల్లోడుగానే జనానికి గుర్తుండి పోయారు. సాత్వికాభినయానికి సంస్కారవంతమైన పాత్రలకు నాగరిక ప్రవర్తనకు నమూనాగా నిలిచి పోయారు. అక్కినేని నాగేశ్వరరావు అనగానే భగ్న ప్రేమల దేవదాసులూ త్యాగరాజులూ ఠక్కున మదిలో మెదులుతారు గాని నిజానికి 'సీతారామ జననం' నుంచి 'సీతారామయ్య గారి మనవరాలు' వరకూ ఆయన పాత్రల్లో వైవిధ్యం అపారం.ఏ పాత్ర వేస్తే ఆ పాత్రకు ప్రాణ ప్రతిష్ట చేయడమే పరమావధి అనుకున్న ప్రామాణిక నటుడు. ప్రయోగాలకు వెనుదీయని ప్రయోక్త. అభిరుచికి పట్టం గట్టిన నిర్మాత.

అక్కినేని నాగేశ్వరరావు జీవితానికి సంబంధించిన వివరాలలో తరచూ ప్రస్తావించేది సినిమా నటులకు గౌరవం లేని కాలంలో తను రంగ ప్రవేశం చేశానని. తనకు పిల్లనివ్వడానికి ఎవరూ ముందుకు రారేమోనని అమ్మ భయపడ్డారని. వాస్తవానికి భారతీయ సంప్రదాయ చింతనలో నటులు, కళాకారులు పంక్తి బాహ్యులు. పశ్చిమ దేశాలలో ప్లేటో కూడా తన ఆదర్శ రాజ్యంలో కవులు, కళాకారులను బహిష్కరించాలన్నాడు. ఇలాంటి నేపథ్యంలో అక్కినేని నాగేశ్వరరావు, నందమూరి తారక రామారావు వంటి వారు కథానాయకులకు గౌరవ ప్రదమైన స్థానం తీసుకురావడానికి కారణభూతులైనారు. ఈ ఇద్దరిలోనూ అసలు వయసులో చిన్న సినిమా వయస్సులో పెద్ద అక్కినేని.

అక్కినేని నాగేశ్వరరావు 1924 సెప్టెంబరు 20న కృష్ణాజిల్లా గుడివాడ సమీపంలోని వెంకట రాఘవాపురంలో వెంకటరత్నం పున్నమ్మలకు పుట్టిన తొమ్మిదో బిడ్డ. ఆడపిల్ల పుట్టాలని ఆశపడిన ఆ తల్లి మగపిల్లాడు పుట్టినా నిరాశ పడకుండా అతనికే జడ వేసి పూలు పెట్టి మురిసిపోయింది. తదుపరి కాలంలో ఈ బుడతడు మహిళా ప్రేక్షకుల అభిమాన కథానాయకుడవుతాడని ఆమె వూహించి వుండరు. ఆడపిల్లగా అగుపించే అతనితో తొమ్మిదో తరగతిలో హరిశ్చంద్రలో చంద్రమతి వేషం వేయించారు.. అదే ఫక్కీలో విప్రనారాయణలో దేవదేవి, సారంగధరలో చిత్రాంగి వగైరా నాయికల వేషాలు కట్టి మెప్పించాడు. దేవ దేవి పాత్ర చూసిన ప్రజాకళాకారుడు కోడూరు అచ్చయ్య, నాటక నిర్వాహకులు దుక్కిపాటి మధుసూదనరావు తమ ఆశాజ్యోతి నాటకంలో కథానాయికగా



ఎన్నుకున్నారు. దుక్కిపాటి నట జీవితానికి మార్గదర్శకుడైనాడు.

బాలనటుడుగా ధర్మపత్ని(1941) ఆయన తొలి చిత్రం. అంటే ఖచ్చితంగా డెబ్బయి ఏళ్లకిందట. తర్వాత ఒకటి రెండు అవకాశాలు దగ్గరకొచ్చి వూరించి జారిపోయాయి. నలభైలలో రెండవ ప్రపంచ యుద్ధం భయ వాతావరణాన్ని సృష్టించింది. సినిమా జనం మద్రాసు నగరాన్ని వదిలివెళ్లి పోయారు. ఆ బెడద సర్దుకున్నాక ఘంటసాల బలరామయ్య తన ప్రతిభా సంస్థ పతాకంపై వరుసగా చిత్ర నిర్మాణం కొనసాగిస్తూ 1944లో సీతారామ జననం ద్వారా అక్కినేని నాగేశ్వరరావును కథానాయకుడిగా పరిచయం చేశారు. తెలుగు చిత్రాల మూల విరాట్టులో ఒకరైన గూడవల్లి రామబ్రహ్మం 'మాయాలోకం'లో హీరోగా తీసుకున్నారు. ఈ రెండు శతదినోత్సవాల తర్వాత రామబ్రహ్మం పల్నాటి యుద్ధం లో బాలచంద్రుని పాత్ర కూడా పేరు తెచ్చింది. బలరామయ్యనే ముగ్గురు మరాఠీలు (1946), బాలరాజు(1948) చిత్రాలతో ఆయనను తారాపథంలోకి తీసుకెళ్లారు. ఇందులో బాలరాజు రికార్డు కలెక్షన్లతో అక్కినేనిని సూపర్ హీరోను చేసింది. 26 కేంద్రాల్లో రజతోత్సవం, 13 చోట్ల 200 చోట్ల ద్విశత దినోత్సవం,69 కేంద్రాల్లో శత దినోత్సవం జరుపుకొన్నది. ఈ అఖండ విజయంతో అక్కినేని వెనక్కు తిరిగి చూసుకునే అవసరమే కలగలేదు! తన గొంతు స్త్రీ కంఠానికి దగ్గరగా వుందని ఖర్జ్ అనే పద్ధతిలో చల్లటి కుండను కావలించుకుని గాత్ర సాధన చేసేవారట. తర్వాత ఆయనే బలరామయ్యకు చెప్పి అప్పుడప్పుడే అవకాశాలు అన్వేషిస్తున్న తన నేస్తం ఘంటసాల వెంకటేశ్వరరావుతో పాడించారు..

భగ్నప్రేమికుడైన బాలరాజు...

బాలరాజుగా కనకవర్షం కురిపించిన అక్కినేని ఆ మరుసటి ఏడాది భగ్న ప్రేమికుడైన మజ్నూగా మరో విభిన్న పాత్రకు ప్రాణం పోశారు. భానుమతి రామకృష్ణ దంపతులు భరణీ పతాకంతో తీస్తున్న లైలామజ్ను (1949) చిత్రంలో ఆయనను ఎంపిక చేయడం ఎవరూ హర్షించలేదు గాని జనం ఆదరించారు. ఈలోగా ఎన్టీఆర్ కూడా మనదేశం (1947) చిత్రంతో ఎల్వీప్రసాద్ ద్వారా చిత్ర రంగ ప్రవేశం చేశారు. ప్రసాద్ ఈ ఇద్దరి కాంబినేషన్‌తో సంసారం(1950) తీసి విజయఢంకా మోగించారు. తెలుగులో సాంఘిక చిత్రాలకు సంసారం మొదటి సంకేతమైతే అక్కినేని ఆ మార్గంలో నిలదొక్కుకోవడానికి మొదటి అడుగు. ఉత్తరోత్తరా ఎన్టీఆర్ జానపద పౌరాణికాలకు పేరు తెచ్చుకున్నారు. 1951లోనే అక్కినేని నిర్మాతగా ఆదినారాయణరావు, అంజలీదేవి దంపతులతో కలసి మాయలమారి చిత్రం తీశారు.

తర్వాత కొన్ని మజిలీలు వదిలేస్తే 1953 ముఖ్యమైన మలుపు. డివిల్ నారాయణ వేదాంతం రాఘవయ్య దర్శకత్వంలో తీసిన దేవదాసు అక్కినేనికి నటుడుగా పునర్జన్మను ప్రసాదించింది. అన్నిభాషల్లోనూ అనేకసార్లు విఫలమైన ఆ కథను భాగస్వాములందరూ వదిలేసినా డివిల్ సాహసంతో తీశారు. నాయికగా వుండాల్సిన షావుకారు జానకి తప్పుకుంటే సావిత్రితో పార్వతి వేషం కట్టించి మహత్తర విజయం సాధించారు. తెలుగు సినిమా ట్రేడ్ మార్కులలో అక్కినేనికి దేవదాసు పాత్రలు, నందమూరికి దేవుడి పాత్రలు అలా అమరిపోయాయి. చెప్పాలంటే ఆయన పౌరాణిక కృష్ణుడైతే ఈయన సాంఘిక కృష్ణుడు.

పౌరాణిక... చారిత్రికాల్లో కూడా...

అక్కినేని జానపదాలలో మొదటిదైన బాలరాజు తర్వాత మాయలమారి, ముగ్గురు మరాఠీలు, సువర్ణ సుందరి చెప్పుకోదగినవి. మహాకవి కాళిదాసు, అమరశిల్పి జక్కన, మహాకవి క్షేత్రయ్య, భక్త జయదేవ, తెనాలి రామకృష్ణ వంటి చిత్రాలతో ఆయన ఆనాటి కళా స్రష్టలను సాక్షాత్కరింప చేశారు. ఎన్టీఆర్‌తోపాటు భూకైలాస్‌లో నారదుడుగా, మాయా బజార్‌లో అభిమన్యుడుగా, శ్రీకృష్ణార్జున యుద్ధంలో అర్జునుడుగా పాత్రలకు జీవం పోశారు (తర్వాత తనుగానే విరమించుకున్నారు). భక్త తుకారాం, విప్రనారాయణ, చక్రధారి వంటి చిత్రాలలో సాత్వికాభినయంతో జనాదరణ పొందారు.

రొమాంటిక్... ట్రాజెడీ కింగ్....

ఇవన్నీ ఎన్ని చెప్పుకున్నా ఆయన సాంఘిక చిత్రాలే ఆయనను చిరస్మరణీయుణ్ని చేశాయి. సంస్కారవంతమైన విద్యాధికుల పాత్రలు, భావుకత గల కళా సాహిత్యకారుల పాత్రలు, కుటుంబ సంబంధాలను హృద్యంగా ఆవిష్కరించే పాత్రలు, మంచి స్నేహితుడి పాత్రలు త్యాగాలూ వియోగాలు మేళవించిన పాత్రలు, రసికత నిండిన పాత్రలు, ఆకతాయి అల్లరి పాత్రలు, విషాద గంభీర పాత్రలు రకరకాల రూపాలలో ఆయన విజయాలు సాధించడమే గాక నిర్మాతలకు లాభాలు కూడా పండించారు. మొత్తంపైన అక్కినేని చిత్రాల విజయాల శాతం ఎక్కువగా వుంటుందని పరిశ్రమ



భావన.

♦ మెతకదనం మూర్తీభవించిన అంతర్వర్తనుడుగా బాటసారి పాత్ర తనకెంతో ఇష్టమైనదని ఆయన తరచూ చెబుతుంటారు. అర్ధాంగిలో మానసిక పరిణితి లేని దశ నుంచి భార్య సహాయంతో నిలదొక్కుకోవడం, పునర్జన్మలో మతి కోల్పోయిన కవి, పూజాఫలంలో తెలియని తనం వల్ల అపార్థానికి గురై ఆపైన ఆశాభంగంలో కూరుకుపోయిన సంగీతకారుడు, ప్రేమ నగర్‌లో పసితనపు గాయాల వల్ల తాగుబోతుగా మారిన జమీందారీ వారసుడు, రాజా రమేష్‌లో విష ప్రయోగం వల్ల ఘర్షణకు గురైన జమీందారు ఇలా మనో వేదనను ప్రతిబింబించే పాత్రలెన్నో ఆయన పండించారు.

♦మంచి మనసులు, వెలుగు నీడలు, డాక్టర్ చక్రవర్తి, మురళీకృష్ణ మనుషులు మమతలు,మంచి కుటుంబం వంటివి ప్రేమ త్యాగం ఇతివృత్తంతో వచ్చినవి.

♦ పరదేశి, మాంగల్యబలం, ఇలవేల్పు, అర్ధాంగి, భార్యాభర్తలు, పెళ్లినాటి ప్రమాణాలు, బతుకు తెరువు, భార్యాబిడ్డలు,ఆలుమగలు, అండమాన్ అమ్మాయి, మేఘ సందేశం,మనసు మాంగల్యం వంటి చిత్రాలు దాంపత్య బంధాలపై తీసినవి.

♦దొంగరాముడు,దొంగల్లో దొర, భలే రాముడు, అదృష్టవంతులు, బందిపోటు దొంగలు, జమీందారు,బుద్ధిమంతుడు, విచిత్ర బంధం రావణుడే రాముడైతే, రాముడు కాదు కృష్ణుడు, వగైరాలు పరివర్తన చెందిన నాయకుని పాత్రలు.

♦శ్రీమంతుడు, రంగేళీ రాజా, రాజా రమేష్,ప్రేమ నగర్ వంటివి ఉదాత్తంగా మారిన విలాసపురుషుల కథలు.

♦రోజులు మారాయి, నమ్మిన బంటు, రైతు కుటుంబం, దత్తపుత్రుడు, దసరా బుల్లోడు వంటివి పల్లెటూరి నేపథ్యం వుండేవి.

♦ఇద్దరు మిత్రులు, మంచివాడు, పవిత్ర బంధం, గోవుల గోపన్న, సిపాయి చిన్నయ్య వంటివి ద్విపాత్రాభినయ చిత్రాలు.

♦మూగమనసులు దానికదే ఒక విలక్షణ చిత్రం. పూర్వజన్మ వృత్తాంతం ఒక్కటి పక్కన పెడితే గోదావరి అందాల మధ్య అమ్మాయి గారి కోసం పరుగులు దీసే పడవవాడు గోపిగా అక్కినేని నటన మరపురానిది. ఆయన సావిత్రి కలసి ఆ చిత్రాన్ని కళాజగతిలో శాశ్వతం చేశారు.

ఎన్నెన్నో విశేషాలు..

♦ అక్కినేని జగపతి, పిఎపి, స్వంత సంస్థ అన్నపూర్ణ వంటి వాటిలోనూ, కొంత వరకూ సురేష్ పిక్చర్స్‌లోనూ ఎన్నో మంచి చిత్రాలలో నటించి తనకంటూ ఒక బాణీని సృష్టించుకున్నారు. అదృష్టవంతులుతో మొదలుపెట్టి దసరా బుల్లోడుతో స్టెప్స్‌కు ప్రాచుర్యం కలిగించారు. శాంతకుమారి నుంచి శ్రీదేవి వరకూ ఎన్నో తరాల నాయికల పక్కన నటించి మెప్పించారు.ఆయన 80 మంది నాయికలతో నటించినట్టు లెక్క. దర్శకులలోనూ ఆదుర్తి, వి.మధుసూదనరావు, ప్రత్యగాత్మ వంటి వారితో వరుసగా మంచి చిత్రాలు అందిస్తూ వచ్చారు.

♦ తొలి దశలో దేవదాసుతో అక్కినేని సినీ జీవితం శిఖరాగ్రాన్ని అందుకుంటే మలి దశలో ప్రేమాభిషేకంతో వసూళ్లలో కొత్త చరిత్ర సృష్టించి ఆయనను ప్రేమమూర్తిగా గుర్తిండిపోయేలా చేసింది.

♦ అక్కినేని వయసు మళ్లిన తర్వాత కూడా నటుడుగా విశ్రాంతి తీసుకోలేదు. బహుదూరపు బాటసారి, సూత్రధారులు, ప్రాణదాత, కాలేజీ బుల్లోడు, పండుగ, రావుగారిల్లు వంటి చిత్రాలతో తన ముద్ర కొనసాగించారు. ఈ దశలో ఆయన వేసిన పాత్రల్లో మరో మైలు రాయి సీతారామయ్య గారి మనవరాలు.

♦ నటుడుగానే ఆగిపోకుండా దుక్కిపాటి మధుసూదనరావుతో కలసి భార్య పేరిట అన్నపూర్ణా ఫిలింస్ స్థాపించి దొంగరాముడుతో మొదలెట్టి వరుసగా అనేక విజయవంతమైన చిత్రాలు నిర్మించారు. సామాజిక చైతన్యం ధ్యేయంగా ఆదుర్తితో చక్రవర్తి చిత్ర పతాకంపై ఆయన తీసిన సుడిగుండాలు, మరో ప్రపంచం చిత్రాలు అరవైల నాటి ప్రయోగాలు.

ఆయన చిత్రాల్లో సంగీతానికి ఎంత ప్రాధాన్యత వుంటుందంటే ఘంటసాల, ఆత్రేయల మరణం తర్వాత తనలో ఒక భాగం పోయినట్టే ఆవేదన చెందారు. సావిత్రి, ఆదుర్తి లేకపోవడం కూడా శాశ్వతమైన లోటుగా చెబుతుంటారు. ఆత్రేయ మనసు పాటలకు అభినయించాలంటే అక్కినేనికే సాధ్యమనిపిస్తుంది. అలాగే ప్రౌఢ శృంగార విషాదాల అభినయంలో అక్కినేని సావిత్రి



శాస్త్ర విభూషణుడు పల్లె రామారావు

అక్కినేని నాగేశ్వరరావుతో పాటు పద్మ విభూషణ్ ఈ సారి తెలుగు శాస్త్రజ్ఞుడైన పల్లె రామారావుకు దక్కింది.1937లో పుట్టిన రామారావు 64లో బనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి పిహెచ్‌డి చేశారు.అమెరికాలో పరిశోధనలు చేసి వచ్చిన అనంతరం బెనారస్‌లోనే మళ్లీ పని చేశారు. రక్షణ లోహ సంస్థలోనూ అణుశక్తి నియంత్రణ సంస్థలోనూ కీలక బాధ్యతలు నిర్వహించారు.



బహుభాషల గాన భూషణ బాలుడు

తెలుగు వారి గుండె గొంతుకు ఎస్‌పి బాల సుబ్రహ్మణ్యాం పద్మ భూషణ్ పొందడం ఒక ఆనందమైతే అది తమిళనాడు కోటాలో కావడం ఆశ్చర్యం. అయితే అది ఆయన బహుభాషా పాండిత్యానికి నిదర్శనం అని కూడా అనందించవచ్చు. ఏమైనా కళకు భాషా భేదం లేదు కదా!

పద్మ భూషణ్ వరకూ సాగిన ఏరువాక వహీదా

'రోజులు మారాయి' చిత్రంలో 'ఏరువాక సాగారోరన్నో చిన్నన్నా..' అంటూ అదరగొట్టి ఆపైన బాలీవుడ్‌కు దూసుకుపోయిన తెలుగింటి తార వహీదా రెహ్మాన్‌కు పద్మభూషణ్ లభించింది.

పారిశ్రామిక భూషణులు - అంజిరెడ్డి, జివికె

ఈ ఏడాది పలువురు తెలుగు పరిశ్రమాధిపతులకు కూడా పద్మం వరించింది. మందుల రంగంలో చెరగని ముద్ర వేసిన కె. అంజిరెడ్డికి, శరవేగంతో దూసుకుపోయిన వ్యాపారవేత్త గునపాటి వెంటక కృష్ణారెడ్డికి పద్మ భూషణ్ అవార్డులు లభించాయి.

పుల్లెల శ్రీరామచంద్రుడు

కోనేరు రామకృష్ణారావు

కైలాసం రాఘవేంద్రరావు

గగన్ నారంగ్

టబూ

వివిఎస్ లక్ష్మణ్

జంటకు సాటి లేదనిపిస్తుంది.

ఈ ట్రాజెడీ కింగ్ మిస్సమ్మలో చేసిన హాస్య విన్యాసాలు ఇప్పటికీ అలరిస్తుంటాయి. అలాగే చక్రపాణి, ప్రేమించి చూడు లాంటి చిత్రాల్లో కూడా.

క్రమ శిక్షణ... వ్యాపార దక్షత...

అక్కినేని కళాకారుడే గాక వ్యాపారవేత్తగానూ దక్షత చూపించారు. ఇది తమకు ముందున్న చిత్తూరు నాగయ్య వంటి వారి జీవితాలను చూసి నేర్చుకున్న పాఠం అంటారు. తెలుగు చిత్రాల నిర్మాణం మద్రాసులో జరుగుతున్న రోజులలోనే ఆయన హైదరాబాదు తరలి వచ్చి ఇక్కడ నిర్మాణాన్ని ప్రోత్సహించారు. పిల్లల చదువుల కోసమే వచ్చానని చెప్పినా ఇతర పరమార్థాలు కూడా అందులో వున్నాయి. అభ్యుదయ భావాల నేపథ్యం వున్న దర్శక నిర్మాతలు ఆయనను కేంద్రంగా చేసుకుని కుటుంబ విలువలతో కూడిన చిత్రాలు నిర్మిస్తూ వచ్చారు. గుండెపోటు వచ్చినప్పటికీ ఆయన సరైన చికిత్సతో తట్టుకున్నారు. అన్నపూర్ణ స్టూడియోను అపురూపంగా తీర్చి దిద్ది రాష్ట్రపతి ఫక్రుద్దీన్‌తో ప్రారంభింపచేశారు. సెక్రటరీ చిత్ర నిర్మాణంతో ఆ స్టూడియో మొదలైంది.

నమ్మకాలకు పుట్టినిల్లయిన చిత్ర పరిశ్రమలో అక్కినేని హేతుమానవతా వాదిగా కనిపిస్తుంటారు. దేవుడు వున్నాడో లేదో నాకు తెలియదు గాని అంటూ ప్రసంగం ప్రారంభిస్తుంటారు.

అయిదో తరగతి చదవని అక్కినేని శ్రీలంకలో ఒక సమావేశంలో వచ్చీరాని ఆంగ్లం మాట్లాడబోయి భంగపడ్డాక విపరీతమైన వేదనకు గురై స్వయంకృషితో ఇంగ్లీషుపై పట్టుసాధించారు.. ఆ రోజుల్లో మశూచికం సోకితే మచ్చలు రావడం నిర్మాతలకు నష్టదాయకమని నరక యాతన అనుభవించి మరీ వాటిని రాకుండా చేసుకున్నారు. కవితాభిరుచితో అక్కినేని ఆలోచనలు పేరిట సంకలనం వెలువరించిన కాళిదాసు కూడా.



అసంఖ్యాక గౌరవాలు

'అక్కినేని అవార్డులు అందుకోవడంలో అతిథి కాదు, కస్టమర్ అయిపోతున్నారు' అని కేంద్ర మంత్రి బ్రహ్మానందరెడ్డి అన్నారట. అర్ధాంగి, తెనాలి రామకృష్ణ, తోడికోడళ్లు, పెళ్లినాటి ప్రమాణాలు, మాంగల్యబలం, జయభేరి, నమ్మిన బంటు, మహాకవి కాళిదాసు, భార్యాభర్తలు, మూగమనసులు, అంతస్తులు, మనుషులు మమతలు, మేఘ సందేశం సూత్రధారులు చిత్రాలకు కేంద్ర ప్రభుత్వ అవార్డులు లభించాయి. 1964లో నంది అవార్డుల ప్రదానం ఆయన డాక్టర్ చక్రవర్తితోనే మొదలైంది. తర్వాత సీతారామయ్య గారి మనవరాలు, మేఘ సందేశం వరకూ ఆ పురస్కారాన్ని పదే పదే అందుకున్నారు. 1957లో నట సామ్రాట్ గా సన్మానం అందుకున్న తర్వాత 1968లో పద్మశ్రీ, 1977లో కళా ప్రపూర్ణ, 1988లో పద్మభూషణ్, 1990లో రఘుపతి వెంకయ్య పురస్కారం, 1991లో దాదాసాహెబ్ ఫాల్కేతో అత్యున్నత పురస్కారం ఆయనకు లభించాయి. అయితే ఇవేవీ ఆయనకు కితాబులు కావు, ఎందుకంటే అక్కినేని జీవితం నటనకు నిర్వచనం. ప్రతిభకు నిదర్శనం. పట్టుదలకు పరిణతికి నిలువుటద్దం. అక్కినేని నాగేశ్వరరావు అందుకోని శిఖరాల్లేవు అని బాపు రమణలు కార్టూనీకరించారందుకే.. నిర్మాతగా వెంకట్, అగ్రకథానాయకుడుగా నాగార్జునలే గాక మనవడు నాగ చైతన్య మరో మనవడు సుమంత్ కూడా నట వారసులుగా వెలుగొందుతుంటే- తన నటనతో, జీవితంతో ప్రేరణ పొందిన అసంఖ్యాక కళా కారులు అను నిత్యం జేజేలర్పిస్తుంటే నట సామ్రాట్ కడదాకా నటుడుగానే నిలవాలని తన కోరికగా చెబుతుంటారు.

నవ పద్మాలు

ఇక పద్మశ్రీ పురస్కారాలు తొమ్మిది మంది తెలుగు వారికి దక్కాయి. ఇందులో అన్ని రంగాల వారూ వుండడం విశేషం. కాకపోతే రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసిన చాలా మందికి రాలేదు.

- సంస్కృతంలో మహా పండితుడైన పుల్లెల శ్రీరామచంద్రుడు
- ఆంధ్రా విశ్వ విద్యాలయం మాజీ విసి, ప్రణాళికా నిపుణుడు కోనేరు రామకృష్ణారావు
- చేనేతకు జాతీయ గౌరవం కల్పించిన నల్గొండ జిల్లా చేనేత కళాకారుడు గజం గోవర్థన్
- రాజేంద్ర నగర్ వ్యవసాయ శాస్త్రజ్ఞుడు సిద్దిఖి
- హైదరాబాద్ బ్యాట్స్‌మ్యాన్ వివిఎస్ లక్ష్మణ్
- స్టార్ షూటర్ గగన్ నారంగ్
- చెన్నై ఆర్కిడ్ కెమికల్స్ అండ్ ఫార్మా అధిపతి కైలాసం రాఘవేంద్రరావు
- హైదరాబాదులో పుట్టిన బాలీవుడ్ తార టబూ
- సామాజిక కార్యకర్త అనితా రెడ్డి

హలో బ్రదర్స్!!

తెలుగు వాళ్లకు సంబంధించినంత వరకూ ఏఎన్నార్, ఎన్టీఆర్‌లు తెరకే పరిమితమైన నటులు కాదు. నిత్య జీవితంలో ఆలోచనల్లో భాగమైపోయిన మహా ప్రభావ శీలులు. ఇద్దరి అభిమాన సంఘాల మధ్య స్పర్థలు, సంఘర్షణలు ఒక దశలో పెద్ద బెడదగా మారితే వారే సర్దుబాటు చేశారు. 1944లో అక్కినేని, 1947లో నందమూరి తెరంగేట్రం చేసినా 1950లో సంసారంలో కలసి నటించడంతోనే వారి ప్రయాణాలు కలిసిపోయాయి. గుండమ్మ కథ, మిస్సమ్మ, భూ కైలాస్, కృష్ణార్జున యుద్ధం, పల్లెటూరి పిల్ల, పరివర్తన, చరణదాసి, తెనాలి రామకృష్ణ, భక్త రామదాసు మలి దశలో చాణక్య చంద్రగుప్త, రామకృష్ణులు, సత్యం శివం వచ్చాయి. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వెళ్లి కాంగ్రెస్‌ను ఢీకొనడం వల్ల ఒక దశ తర్వాత ఆయనకు పురస్కారాలు ఆగిపోయాయనే భావన బలంగా వుంది. అయితే ఎన్టీఆర్‌కు సముచిత గౌరవం లభించి వుంటే అక్కినేని కూడా హర్షించేవారనడంలో సందేహం లేదు. నందమూరి బాలకృష్ణతో బాపు రమణ తీస్తున్న శ్రీరామరాజ్యంలో వాల్మీకిగా కనిపిస్తున్నారందుకే. ★

కథ

"ఏట్రా సత్తిమో... సోమినాయుడు కేటయ్యింది?"

రామ్మందిరం అరుగు మీద నుంచి ఒక్క ఉదుటన కిందకు గెంతి పరుగు లాంటి నడకతో సత్యాన్ని అనుసరిస్తూ అడిగేడు లక్ష్యంనాయుడు. బేతాళుడ్ని తన భుజాన మోస్తున్న విక్రమార్కుడిలా గబాగబా అడుగులేస్తూ నడుస్తున్న సత్యం ఏం జవాబివ్వలేదు. అతను మళ్లీ అడిగేడు.

"పాము కరిసిందిరా!" సత్యం వెనుక నడుస్తున్న ముగ్గురిలో ఒకతనన్నాడు. పిడుగు పడ్డట్టు అదిరిపడ్డాడు లక్ష్యంనాయుడు. ఎందుకంటే సదరు వ్యక్తి అతనికి బంధువు.

"ఏం పామురా... అది?" గుంపులో కలసిపోతూనే ఆందోళనగా అడిగాడు.

"నాగుపామేనట" భయం నిండిన స్వరంతో అన్నాడతను.

భాద్రపద మాసం.. గతనెల రోజుల్నుంచి మితిమీరి కురుస్తున్న వర్షాలతో ఏటొడ్డునున్న సంతోషపురం గ్రామం తడిసి ముద్దయింది. దారంతా చిక్కని బురద.. దానికి రెండువైపులా కారుతోన్న పశువులశాలలు.. వర్షపు నీరు చేరిన గుంతలు... ఆ

బలి

- పాలకొల్లు రామలింగస్వామి

రోడ్డంతా చిత్తడిగా ఉంది. వానకి తడిసి ముద్దయి.. మునగదీసుకుని కూర్చుని ఉన్న కోడి పిల్లలా.. ఉంది ఊరు ఊరంతా!

"కొంచెం సాయం పట్టండిరా.. లోపల మంచమ్మీదికి తోడు బెట్టేద్దుము!" స్వామినాయుడు ఇల్లు రావడంతో తన అనుచరులతో అన్నాడు సత్యం. లక్ష్యంనాయుడు వెంటనే గడపలోకి వెళ్లి గోడవారగా ఉన్న నులకమంచాన్ని వేశాడు. బొంత పరిచి తలగడ వేశాడు. ఇద్దరు అతని కాళ్లు పట్టుకొని లోపలికి దూరి నెమ్మదిగా అతన్ని మంచంపై వేశారు. అతను పులిదాడికి గాయపడి తృటిలో తప్పించుకున్న లేగదూడలా భీతిల్లి ఉన్నాడు. పాలిపోయిన ముఖం... కన్నీరొలుకుతున్న కళ్లతో దైన్యంగా దిక్కులు చూస్తున్నాడు.

"ఏట్రా... అన్నయా.. మీ బావకేటయ్యిందిరా.. నాయన!" గట్టిగా అంటూ ఎక్కడనుంచో వచ్చిన అతని భార్య పార్వతి అప్పుడే గుమ్మంలో అడుగుపెట్టింది. జరిగినదేమిటో పూసగుచ్చినట్టు వివరించాడు సత్యం.

"నానప్పుడే సెప్పినాను.. ఏదయిన పురుగుపుట్రా ఉంటాయి నాయన.. ఈ ముసుర్తోటి బోడిపొలం ఎల్లొద్దంటే ఇన్నాడా.. ఇప్పుడు సూడురా నాయనో.. ఏటయ్యిందిరో దేవుడో.." ఏడుస్తూ శోకాలు మొదలెట్టింది.

"అమ్మీ.. ఛ..ఛ.. ఊర్కో! ఇప్పుడేటయ్యిందని ఆ ఏడుపు? మే మంతలేమేటి? ఆడినలాగే వొగ్గేస్తామేటి సెప్పు ... ఇదిగో! అల్లా ఇసనగర్ర తీస్కొచ్చి ఇసురుతుండు. ఆడికి గాలి తగలాల.. జాగర్తగా సూస్తుండండి. నానిప్పుడే వొస్తాను.' పార్వతిని సముదాయించి బయటకు వెళ్లాడు సత్యం.. కొంగుతో కళ్లను వత్తుకుని ఇంటిపెనకన ఉన్న విసరకర్రను తీసి భర్తకు విసరడం ప్రారంభించింది..ఊర్లోని ఒక్కరొక్కరు ఆ ఇంటి ముందు వచ్చి చేరుతున్నారు.

"సోమినాయుడో.. దవిర్యంగా ఉండురా.. మేమంత లేమేటి... నీకేదైనా జరగనిస్తామా...ఎందుకలాగ గుండెలార బెట్టేసుకుంతావు?" అతని చుట్టూ చేరిన కొంతమంది స్వామినాయుడుకి ధైర్యం నూరిపోస్తున్నారు. "సోమినాయుడో.. బెంగెందుకు..? ఇప్పుడెలాగ ఉందరా?!" చేత్తో కుదుపుతూ అడిగేడు లక్ష్యంనాయుడు.

ఆ మాటలకి అతనిలో కొంత కదలిక వచ్చింది.

"వొళ్లంతా విసవిసలాడతందిరా.. కాలి ముడుక్కి కిందకాన్నుంచి ఒకటే సలుపు.. అక్కడ.. బరువుగా పచ్చిపుండునాగ ఉందిరా?" బాధ భరిస్తూ తలను అటూ ఇటూ తిప్పుతూ నీరసంగా అన్నాడతను. స్వామి నాయుడు కాలిపిక్కనగల కింద భాగమంతా బాగా వాచిపోయి ఉంది. రెండు రక్తం బొట్టుల్లా కనిపిస్తున్న ప్రాంతానికి అరచేయంత ఎత్తులో మూడు వరసల్లో మొలతాడు గట్టిగా కట్టబడి ఉంది.

"ఔన్రా బావో..! అసలిదెలాగ జరిగిందిరా?" అడిగేడొక ముసలాయన.

"ఇందాక రెండుగంటలప్పుడు బోడి పొలంకాసి అలాగ ఎల్లాను. పనిలో పనిగా అరటి తోటలోకి కూడా ఎల్లొస్తుంటే పరిమిముళ్లు గుచ్చుకున్నట్టుగా పటక్కమని శబ్దం ఒక్కసారి వొచ్చిందిరా.. ఏటిరా ఈ శబ్దమని కిందకు సూత్తే మరింకేటి పక్కనించి నింపాదిగా ఎల్లిపోతుంది నాగుపాము.. కరెంటుసాకు కొట్టినట్టు జువ్వుమని లాగుతుంది. కాలు.. అమ్మనాయన.. పీక తీసిందిరా అని వొక్కసిటం కూడా ఆలస్యం సెయ్యకుంట బబ్బుర్లు కొట్టుకుని పరిగెట్టినాను. దార్లోన ఈ మందుల సత్తిము అవుపడినాడు. కట్టెందుకు దెబ్బకాడ కల్పులేదని రెండుదెండులు బెట్టి ఆడే మొలతాడుని తెంపి కాలిదగ్గర గట్టిగా బిగించి కట్టినాడు. సలుపుతోటి నాను పరిగెట్టనేకపోతే ఆడే నన్ను భుజంకెత్తుకొని వూర్లోకి పారొచ్చినాడు." ఆ సంఘటనను వివరించినపుడు అతని కంఠంలో బాధకంటే వణుకే స్పష్టంగా వినిపించింది.

"వొరేయి నాయన.. ఇదిగోరా నాగస్పీరముక్క. దీన్ని నోట్లో ఉంచుకుని రసం మింగుతుండు. ఎట్టి పరిస్థితుల్లోన దీన్ని బయటకు ఊసేవొద్దురేయ్.!" అన్నాడు సత్యం. నోట్లోని మూలికను కొరకడం మొదలుపెట్టాడు స్వామినాయుడు. "కంగారేటి లేదు. వన్నాట్ ఎయిట్‌కు ఫోన్ చేసేం. వచ్చేస్తుంటాదిలెండి" ఎవరో చదువుకున్న కుర్రాడు కాబోలు అక్కడకు వచ్చి చెప్పేడు. "మంచిదేనిరా.. అయ్యోరు వొచ్చేంత వరకు అమాస ఆగుతాదేటి.. ఆ బండొచ్చినంత వరకు ఆగితే ఇంకెటన్నా ఉందా?.. అసలే సావుబతుకు సమస్య.. లేటు సెయ్యకూడదు." అన్నాడు మునిగాళ్లపై కూర్చుంటూ రామినాయుడు "ఐతే ఇప్పుడేటి సేద్దుము?!"

"మరెందుకు నేటు.. ఆ రాముగాడి ఆటోనైదా.. దాన్ని కట్టించుకొని సోమినాయున్ని టవునుకు తీసుకెల్లిపోదుము. వొకేల.. ఒన్నాట్ ఎయిట్ బండి దార్లోన ఎదురుపడిందనుకో. తగువేనేదు. ఈ లోపున మనకి టయిము కూడా కలిసొస్తాది గదా! మరింకేటయితే.. ! ఆ రాంబాబు సెప్పినట్టుగ అంతా సెయ్యండి... ఎల్లండి" అంతిమ నిర్ణయాన్ని ఎవరో ప్రకటించేరు. వేరెవరో రాము దగ్గరకి వెళ్లి ఈ విషయమంతా చెప్పారు.

వెంటనే.. అతను ఆటోను తీసుకువచ్చి స్వామినాయుడు ఇంటి ముందాపేడు. జాగ్రత్తగా ముందు స్వామి నాయుడుని అందులోకి ఎక్కించి అతన్తోపాటుగా భార్య పార్వతి, లక్ష్యంనాయుడు, సత్యంలు కూడా ఎక్కేరు.

ఆటో బయల్దేరింది...

మొదట బురదను తర్వాత రాళ్లు దేలిన రోడ్డును అది దాటుకుంటూ వెళ్లింది. అలా అరకిలోమీటరు దూరం ప్రయాణించేక కుడివైపునున్న తార్రోడ్డు పైకి చేరి రయ్యిమని పరుగులు తీస్తోంది.

సన్నగా.. వాన జల్లు కూడా మొదలైంది. కొత్త బ్రిడ్జి కింద నుంచి రెండు వొడ్డుల్ని వొరుసుకుని ఉరుకులు పరుగులతో నాగావళి నిండుగా ప్రవహిస్తుంది.

ఎడమ మట్టికట్టకు సమీపంలోనే 'రోడ్ డైవర్టెడ్' అన్న బోర్డు కూడా తగిలించి ఉంది. సరిగ్గా అక్కడకు చేరాక ఆటోవేగాన్ని తగ్గించేడు రాము. "ఔన్రా బావో.. ! ఈ గట్టెక్కించేసి అవతల రోడ్డుపైనుంచి టవునుకు ఎల్లిపోవా మరి" రాముని ప్రశ్నించేడు లక్ష్యంనాయుడు.

"లేదన్నియా... ఆవల మార్కొండ పుట్టిదగ్గర రోడ్డుమీద నీరింకా తగ్గలేదు. ట్రాక్టర్లే ఎల్లడానికి బయపడుతున్నాయి. మన ఆటో ఒక లెక్కేటి?" "మరయితే.... ఇప్పుడేట్రానయన... దారి?!"

"ఏటంటాది.. ఈ మట్టి రోడ్డు కాసి ఎల్లిపోవడమే.. వొకేల దార్లోన అంబులెన్సు బండి ఎదురుపడొచ్చేటో.. ఎట్టాసారు?"

"అదీ... నిజివేలే! కాని ఈ మట్టిరోడ్డు మీద పేషంటు తోటి ఎల్లగలమా లేదా అని

సూస్తన్నా... సర్లేనా.. ఆ దేవుడిదే అంతా బారం.. కొత్తరూటు కాసి బండిని తిప్పిరా.." అన్నాడతను. ఆటోను ఎడమవైపునున్న మట్టిరోడ్డు పైకి నెమ్మదిగా పోనిచ్చాడు రాము. రోడ్డయితే విశాలంగా వేయబడిందిగాని గ్రావెల్‌ది కావడంతో.. ఒక్కోచోట రాళ్లు దేలిపోయి... బురదనీటి గుంతల్తో అస్తవ్యస్తంగా ఉంది. రోడ్డు కుదుపులకి ఆటో ఉండుండి ఎగిరెగిరి పడుతుండటంతో స్వామినాయుడుకి భరించలేనంత నొప్పిగా ఉంది. బాధతో గిలగిలలాడి పోతున్నాడు. అతని అవస్థను చూసి ముగ్గురికీ కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. "ఎనిమిది నెలలుగ పడతున్నాం... ఎన్నాళ్లో ఈ హింస.. తొందరగ రోడ్డెయ్యరు. గావాల...!?" కుదుపులకి వంటికి తగులుతున్న బాధల్ని భరిస్తూ అన్నాడు సత్యం. "ఎందుకేస్త్రారా!... ఎవులిముడుపులు ఆలికి అందిపోతే..!?' అన్నాడు లక్ష్మంనాయుడు. "ఎవులిమేలు గోరి ఈ పోజెక్టు కడతన్నారోగాని మనకి మాత్తరం సిచ్చ తప్పనేదు. ఇన్నాళ్లు రెప్పమూసే తెరిసేలోగా టవును ఎల్లి వొచ్చీసోలం.. ఇప్పుడు జూడు... దూరం పెరిగేసింది. ఈ రోడ్డుకు జడిసిపోయి టౌనుకు ఆటో టిప్పులెయ్యడం కూడా మానీసుకున్నాను" అన్నాడు రాము.

"అవునది నిజివేరా.. బారేజిలో బూములు పోయినోళ్ల సంగతే సూడురా.. అక్కడ రైతన్నవోడు సెట్టుకొకరు పుట్టకొకరు అయిపోలా?"

"మా బాగా సెప్పినావురా... మా తాతగారు ఏటయినారు? గవర్నమెంటిచ్చిన డబ్బుల్తోటి, టవును పక్కనిచ్చిన స్థలాల్తోటి.. ఎవసాయాలొగ్గీసి, సేతికొచ్చిన డబ్బులన్ని కర్సు అయిపోయి బికార్లపోయినేదా?.. ఆకరికి పిల్లపెళ్లికి గూడా ఎన్ని పత్రాకులు పడినారో అవన్నీ మనకి తెలీదా!" అన్నాడు సత్యం. కాసేపయ్యాక వారి సంభాషణ మళ్లీ బారేజి రోడ్డుపైకి మళ్లింది. "అసలు రూలు ప్రకారం బారేజి కాంట్రాట్టరే దీని మీద తార్రోడ్డేసివ్వాల... ఇక్కడిదయ్యింతర్వాతే అక్కడ బారేజి పనుల్లోకి ఎల్లాల.. మరిక్కడ ఏటయ్యింది? సీను రివర్సయ్యింది. దంచిందానికి బుక్కిందే కూడన్నట్టుగా మారింది పరిస్థితి"

"ఇంతమంది లీడర్లున్నారు. ఆపీసర్లున్నారు. ఎవులికి ఈ రోడ్డు గురించి పట్టడం నేదు"

"అదే గదా ఇప్పుడనుకోవడం.. దీని వల్ల ఎన్ని గ్రామాల ప్రజలు యమ యాతన పడతన్నారో ఎవులికి బోదపడ్డంనేదు" ఎటు సమతలంగా ఉంటే అటువైపుకు ఆటోను మళ్లించి నడిపిస్తున్నప్పటికీ మొత్తంమీద కుదుపులు మాత్రం తప్పడం లేదు. రోడ్డుపై వెళుతున్న అన్ని వాహనాలదీ అదే పరిస్థితి. అరగంటయ్యింది. రోడ్డు సగం మాత్రమే దాటింది. దూరంగా నెమ్మదిగా అటూ ఇటూ ఊగిసలాడుతూ 108 వేను వస్తుండటం చూసేడు రాము. "అన్నయ్యా!... అల్లదిగోరా.. బండి వస్తన్నట్టుగుంది. "ఆటోను ఆపుతూ అన్నాడు రాము. లక్ష్మంనాయుడు కిందకు దిగి అంబులెన్సును ఆపి వాకబు చేసేడు. స్వామినాయుడు కోసమే వేను వస్తోందని జవాబు వచ్చింది. "వేనులో ఉన్నమాకే ఒళ్లు హూనమైంది. ఈ ఆటోలో పేషంట్‌ను ఎలాగ తీసుకువొచ్చారయ్యా బాబు!" బండి దిగుతూనే విస్తుపోయాడు హెల్త్ అసిస్టెంట్. స్వామినాయుడును ఆటోనుంచి మెల్లగా కిందకు దించి వేనులోని స్ట్రెచర్‌పై పడుకోబెట్టారు. హెల్త్ అసిస్టెంట్ తన పని ప్రారంభించాడు. బి.పి.మిషన్ని బయటకు తీసి చకచకా బెల్టును స్వామినాయుడు చేతికి చుట్టి రీడింగ్‌ను నమోదు చేశాడు. చేయిపట్టుకుని పల్స్‌రేటును చూశాడు. కాలిపిక్కల మీద ఉన్న కాట్లను, వాపు తీవ్రతను పరిశీలించాడు. ప్రథమ చికిత్స చేసిన తర్వాత వివరాలన్ని కేస్‌షీట్లో రాసుకున్నాడు. ఆపై డాక్టర్‌కు ఫోన్లో వివరాలన్నీ అందించేడు. ముగ్గురూ వేన్లో కూర్చున్నాక.. రాము మాత్రం ఆటోతీసుకుని వెనక్కి వెళ్లి పోయాడు. 108 వ్యాన్ బయలుదేరింది. గోతుల్ని, నీటి గుంటల్ని దాటుకుంటూ నెమ్మదిగా ముందుకు సాగుతోంది. " మా బావకి ఇప్పుడెలాగ వుందిబావ్? ఆందోళనగా అడిగేడు లక్ష్మంనాయుడు "ఏం చెప్పలేం... కండీషనయితే సీరియస్‌గానే ఉంది" ముక్తసరిగా అన్నాడతను. భయంతో ముగ్గురూ బిగదీసుకుపోయారు. ఈ గతుకుల దారిలో.. ప్రాణాపాయం.. కలగకుండా త్వరగా ఆసుపత్రికి చేరేలా చేయ్ దేవుడా! అని వేనులోని ప్రతి ఒక్కరూ మూగగా ప్రార్థించారు. "చెప్పండి... ఏ ఆసుపత్రికి వెళ్లాలి?! హెల్త్ అసిస్టెంట్ వాళ్లనడిగేడు. "గవర్నమెంట్ ఆసుపత్రికే పదండి. లక్ష్మంనాయుడిలో ఎగసిపడుతోన్న దుఃఖాన్ని అతని గొంతు దాచలేకపోతుంది. రోడ్డుమీద గల గుంతలకి వాహనం అటూ, ఇటూ జోగుతూ డబ్బాలో వేసిన గులకరాళ్లలా లోపల ఉన్నవారిని కుదురుగా కూర్చోనివ్వడం లేదు. ఒళ్లంతా నొప్పులవుతున్నాయి. దానికి తోడు స్పీడుబ్రేకర్ల అడ్డులొకటి.. మొత్తానికి ఎలాగోలా గ్రామెల్‌రోడ్ కిందకు దిగింది. ఎదురుగా ఇటుకల లోడుతో ట్రాక్టరు వస్తుండటాన్ని గమనించి దానికి దారివ్వడానికని వేనును ఒక్క పక్కకి నిలబెట్టి ఉంచాడు డ్రైవరు. వేనుని దాటిపోతున్న ట్రాక్టరు డ్రైవరు ఏదో గట్టిగా చెబుతున్నాడు. "అక్కడ ఉలిభద్ర మెయిన్‌కెనాల్ దగ్గర తార్రోడ్డు గతుకుల్లో వేనొకటి దిగబడిపోయింది. బల్లేవి ఎల్లడం లేదు. అతను అన్నదేమిటో డ్రైవరుకు అర్థమైంది. "ఎప్పుడు జరిగింది?" ఇట్నుంచి అడిగాడు. "ఇప్పుడే!" "చచ్చాంరా బాబు!" ఇబ్బందిగా అన్నాడు హెల్త్ అసిస్టెంట్. "ఐతే.. ఇప్పుడేం చేద్దాం?! అంబులెన్స్‌ను స్టార్ట్ చేస్తూ అడిగాడు డ్రైవరు. "బండిపోనీ... దార్లో ఆలోచిద్దాం" అన్నాడతను పొడిగా. భారీ కుదుపులకి వేను అటూ, ఇటూ వత్తిగిల్లుతూ వెళుతోంది. అలా కొంతదూరం వెళ్లేసరికి వాహనాలన్నీ ఒకచోట బారులుతీరి దూరంగా కనిపించాయి. వేనును ఆపేసి 108 సిబ్బంది కిందకు దిగారు. చాలాసేపట్నుంచి ఆగిఉన్న బస్సుల్లోనుంచి దిగిన ప్రయాణీకులు గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నారు.

"ఎంత అనాలోచితంగా పాతరూట్ ఆపేసి ఈ కొత్తదోవ మొదలెట్టారోగాని అప్పట్నుంచి నరకం చూస్తున్నామనుకోండి. పేపర్లో ఎన్ని వార్తలు వచ్చినా దిక్కు లేదు. ధర్నాలు చేసిన లెక్కలేదు.. ఇంత దారుణం ఎక్కడా లేదనుకోండి" ఆక్రోశం వెళ్లగక్కేడు ఎవరో ఒకతను. "ఇదే రూటులో రోజూ తిరుగుతున్న మనలాంటి వాళ్ల తిప్పలుసరే.. అదే మెడికల్ ఎమర్జెన్సీలో ఉన్నవారైతే ఈ రోడ్డుమీద వెళ్లాలంటే ఏటవుతారు?" ఎవరో ఉద్యోగి కాబోలు ఆవేశంగా ప్రశ్నించేడు. "ఇంకేటవుతారు... టపా కడతారు" ఎవరో విద్యార్థి కిసుక్కున నవ్వుతూ అన్నాడు. "మళ్లీ ఎంతో మంది నాయకులు, అధికార్లు ఇలాగే ఈ రోడ్డంటే కార్లలో చక్కగా కసికందకుండా పోతారు. ఈ రూటులో అనేక ఇబ్బందులతో ప్రయాణిస్తున్న సామాన్యుల మాటేమిటి? వారిగోడు ఎవరికీ పట్టదా? వాళ్లంటే ఎందుకంత నిర్లక్ష్యం? పెద్దోల స్వార్థవ్యూహాలకు సామాన్యుడు బలి కావాల్సిందేనా?! ఆవేదన వ్యక్తం చేసేడు మరొకతను. గంట సేపయ్యింది. వేనులో నుంచి సత్యం కిందకు దిగి వైద్యసిబ్బంది దగ్గరకు వెళ్లేడు. "బావో... మనిషి మాట్లాడలేకపోతన్నాడు. ఎవర్నీ గుర్తుపట్టలేకపోతన్నాడు.రండి బావూ... ఏదో వొకటి సెయ్యిండి నాయన.. ఆడినలాగ సూడలేకపోతన్నాం" జీరబోయిన గొంతుతో బతిమాలాడు. అతని అభ్యర్థనను విన్న హెల్త్ అసిస్టెంట్ పేషంట్ పరిస్థితిని మళ్లీ ఫోన్లో డాక్టర్‌కు వివరించేడు. "మా దగ్గర ఉన్న మందులతో ట్రీట్‌మెంట్ చేశాం. ఇంతకు మించి మేం చేయగూడదు. ఎంత వీలైతే అంత తొందరగా పేషంట్‌ను ఇక్కడ నుంచి తీసుకువెళ్లడం తప్ప మేమేం చేయగూడదు" తేల్చి చెప్పాడు హెల్త్ అసిస్టెంట్. ఏం చేయాలో తెలీక తనలో తాను మదనపడుతున్నాడు సత్యం. కాసేపటికి ఒరిగిపోయిన మినీ వేనులోనుంచి బస్తాల్ని తరలించడంతో ట్రాఫిక్ క్లియరయ్యింది. వాహనాలన్నీ వరసగా తప్పుకుని 108కు దారివ్వడంతో... సైరన్ వేసుకుంటూ గుమ్మల్లోని బురదనీ, నీళ్లని చెదరగొట్టుకుంటూ.. మత్తులో జోగుతున్న మనిషిలా అది తన శక్తి కొద్దీ పరుగు పెడుతోంది. చివరికి.. మెట్టుపాక సెంటరు దాటి టౌనులోని ఏరియా ఆసుపత్రి వేపు దూసుకుపోయింది. అపస్మారకంగా ఉన్న స్వామినాయుడుని స్ట్రెచర్‌పై క్షణాలమీద చేర్చి ఆపరేషన్ థియేటర్‌లోకి తరలించుకుపోయారు సిబ్బంది. ట్రీట్‌మెంట్ చేయడానికని బయల్దేరిన డాక్టర్ మెట్లదగ్గర నిరీక్షిస్తోన్న స్వామినాయుడు బంధువుల్ని చూసి వాళ్ల దగ్గరకి వచ్చేడు. "ఆ పేషంట్ తాలుకా.. మీరేనా?!" అడిగాడు.. "అవును బావ్!" బదులిచ్చేరు ముగ్గురు. "చూడండి మీరతన్ని ఎలాంటి సిరీయస్ కండీషన్లో తీసుకువచ్చారో మీకు తెలీడం లేదు. వెంటనే తీసుకు వచ్చి ఉంటే చాలా బావుండేది. ఇప్పటికే చాలా డామేజి జరిగింది. కాలు చేతులకూ పక్షవాతం వచ్చింది. చూపు పాక్షికంగా దెబ్బతింది. మాట కూడా పడిపోయింది. బతికే చాన్సు ఫిఫ్టీ... ఫిఫ్టీ.. నా వంతు ప్రయత్నం నేను చేస్తాను. ఆపై అతని తలరాత.. నేనేం చేయలేను" తను చెప్పాల్సింది చెప్పి టకటకమని మెట్లెక్కిపోతోన్న డాక్టర్ వైపు బేలగా చూస్తుండిపోయారు. "ఓర్నాపెనిమిటో.. నీకెంత కస్టమొచ్చినాదిరా నాయనో నాయన! నువ్వు బతకడం కస్టమంతన్నారో నాయనో.. నాయన! ఆ దిక్కుమాలిన రోడ్డే గనక నాడింగా ఉంటే నీకీ పరిస్థితి వొచ్చేదానాయనో.. నాయన.. ఇక నాకూ నా పిల్లలకు దిక్కెవర్రో నాయనో.. నాయన!" పూనకం పట్టిన దానిలా పెద్దపెట్టున రాగాలు తీస్తూ ఏడుస్తోన్న పార్వతిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. ★



వేడుకలా? ప్రదర్శనలా?

ధర్మారావు కొడుకు వివాహం. శుభలేఖ ఇచ్చారు. ఆ కార్డ్ని లేఖ అనడానికి వీల్లేదు. అరమీటర్ పొడవూ, వెడల్పుతో ఉంది. బంగారు వర్ణంతో తళుకులీనుతోంది. గట్టి అట్టతో చాలా చక్కగా ఎంతో బ్రహ్మాండంగా వధూవరుల మల్టీకలర్ ఫొటోలతో చాలా ఆడంబరంగా ఉంది. ఆ కార్డు ఖరీదు ఎంత తక్కువనుకున్నా 50 రూపాయలకు తక్కువుండదు. ఆ కార్డుతోపాటు విందుకి సంబంధించిన మెనూకార్డు కూడా జత చేసి వుంది. ఆశ్చర్యపోకండి! మెనూలో మొత్తం 116 రకాల ఐటమ్స్ ఉన్నాయి. మెనూకార్డు 1/8 సైజులో నాలుగు పేజీలతో నాలుగు వైపులా నిండి ఉంది. నాలుగు రకాల అన్నాలు (ఫ్రైడ్ రైస్, కోకోనట్ రైస్, వెజిటబుల్ బిర్యానీ... ఏవో పేర్లు), ఎనిమిది రకాల స్వీట్లు, ఎనిమిది రకాల హాట్లు, ఆరు రకాల కిళ్లీలు, ఆరు రకాల ఐస్క్రీములు, చాలా రకాల ఫ్రూట్ జ్యూస్‌లు ఉన్నాయి. ఇక ఎన్నో రకాల పచ్చళ్లూ, కూరలూ, చారులూ, కారాలూ... ఇలా ఎన్నో వుంటేనే కదా మొత్తం 116 అయ్యేది. సామాన్య మానవుడు కాదు, మధ్య తరగతి మానవుడికి సైతం తెలియని... ఎప్పుడూ వినని ఎన్నో రకాల పేర్లు ఆ మెనూలో ఉన్నాయి.

ధర్మారావు అంటే సామాన్యుడు కాదు. రెండు పెట్రోలు బంకులున్నాయి. జిల్లాలో కిరోసిన్ డీలర్‌షిప్ అతనిదే! ఆ కిరోసిన్ తన పెట్రోలు బంకులకి తరలించి డీజిల్లో కిరోసిన్ కల్తీ చేస్తాడని అందరికీ తెలుసు. మరో బంకు లేకపోవడంతో జనం చచ్చినట్లు తిట్టుకుంటూనో, చీదరించుకుంటూనో ఆ బంకుకే వెళ్తారు. అలా కల్తీ చేసి ఎంత సంపాదించాడో లెక్కలేదు. ఆ అక్రమ సంపాదనతోనే ఈ పెళ్లిలో తన ఘనతనీ, దర్పాన్నీ, హోదానీ ప్రదర్శించుకోవాలన్నమాట! అందుకే టౌన్లో గతంలో ఎవరూ చేయనంత ఘనంగా, గొప్పగా, ఆడంబరంగా కొడుకు పెళ్లి చేయాలని నిశ్చయించుకున్నాడు.

రమేష్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. నాలుగేళ్లుగా అక్కడే ఉంటున్నాడు. ఇప్పుడు నెలకి పదీ పన్నెండువేల డాలర్ల జీతం పుచ్చుకుంటున్నాడు. అతనికే ఇప్పుడు పెళ్లి కుదిరింది.

"నాన్నా.. పెళ్లిలో ఖర్చు దగ్గర వెనకాడొద్దు. మూడు నాలుగు నెలల జీతం అంటే 30, 40 డాలర్లు మన కరెన్సీలో కనీసం 15 లక్షలు ఖర్చు పెట్టాలి. నువ్వు పీనాసిగా వుంటావేమో! అందుకే ముందే చెపుతున్నా! 15 లక్షల్లో ఒక్క రూపాయి కూడా మిగలకూడదు. ఏమైనా, ఎలాగైనా ఖర్చుపెట్టు. వెనకాడే ఆలోచనే వద్దు!" అన్నాడు రమేష్ తండ్రితో.

"సరే నువ్వు అంత ఇంట్రెస్ట్ చూపిస్తున్నప్పుడు నేనెందుకు కాదనాలి?" అన్నాడు తండ్రి.

ఆ ఊరేమో చిన్న పల్లెటూరు. జనాభా నాలుగు వేలకు మించదు. పెళ్లి ఊళ్లో చేయాలని తండ్రి కోరిక. కొడుకూ అందుకు సమ్మతించాడు. ఊరంతా భోజనాలు పెట్టినా 15 లక్షల్లో పదోవంతు కూడా ఖర్చుకాదు. ఏం చెయ్యాలి? ఆయన చావుకొచ్చింది. ఒక వ్యాన్ నిండా కూల్‌డ్రింక్ బాటిళ్లు తెప్పించాడు. ఇంకా ఐస్‌క్రీములు, చాలా రకాల స్వీట్లు తెప్పించాడు. చుట్టు పక్కల ఊళ్లలోని జనాన్ని కూడా పెళ్లికి పిలిచాడు. ఆ ఊళ్లో ఫంక్షన్ హాల్ కూడా లేదు. అందుకే టౌన్ నుండి డెకరేటర్లని పిలిపించి ఎకరం పొలంలో కల్యాణ మండపం కట్టించాడు. బెంగుళూరు నుండి రకరకాల పూలని తెచ్చి అలంకరించారు. టీవీలో పాటలు పాడే వాళ్లని పిలిపించి మ్యూజికల్ నైట్ (పాట కచేరి) ఏర్పాటు చేశాడు. రాజమండ్రి నుండి మహిళా పండితుల్ని పిలిచి, ఒక వైపు పెళ్లి జరుగుతుండగా మరో వైపు యాంకరింగ్ చేయించాడు. ఎన్ని విధాలుగా ఖర్చు పెట్టినా ఇంకా డబ్బు మిగిలింది. దూరపు చుట్టాలతో సహా అందరికీ బట్టలు పెట్టారు. స్టీల్ ప్లేట్లు, చైనీస్ గ్లాసుల సెట్లు, నాలుగు స్వీట్లు ఒక కవర్లో పెట్టి ఇంటింటికీ పంచారు. ఇది చూసి ఊళ్లో జనం ఆహా.. ఓహో... అనుకున్నారు. నాలుగు రోజులు ఊళ్లో ఎక్కడ చూసినా ఈ పెళ్లి కబుర్లే.

రామిరెడ్డి నలభై ఎకరాల రైతు. ఊళ్లోనే పెద్ద ఆసామి. చాలా డబ్బు కూడబెట్టాడు. కొడుకు పెళ్లికి వేరే చెప్పేదేముంది? ధూంధాంగా చేశాడు.

బాలాజీ ఆర్డీఓ. ఇంక రెండు నెలల్లో రిటైర్మెంట్. తను ఉద్యోగంలో ఉండగానే చేస్తే మంచిదని కూతురి పెళ్లి పెట్టుకున్నాడు. అమెరికా సంబంధం. అసలే ఆయన లంచగొండి. లంచాలు మెక్కుతూనే ఎంఆర్ఓ నుండి ఆర్డీఓగా ప్రమోషన్ పొందాడు. ఉన్నది ఒక్క కూతురు! ఆమె పెళ్లికి లంచాల సొమ్ము చాలానే ఖర్చుపెట్టాడు.

ఇవి అడ్డగోలుగా డబ్బు సంపాదించిన వాళ్ల పెళ్లి ముచ్చట్లు!

ఇక ఇంతకంటే 'పెద్దల' పెళ్లిళ్లు మరీ విచిత్రం! వాళ్లు ఎన్నెన్ని వింత, వికృత, జుగుప్సాకర పోకడలు పోతారో! ముంబయ్ సినీ తారలు సెలబ్రిటీలట! వాళ్లని పెళ్లికి ఆహ్వానించి, ఒక గంట పెళ్లిలో కనిపిస్తే 20 లక్షల నుండి కోటి రూపాయలు చెల్లించుకుంటారట! స్థాయిని బట్టి రెండు కోట్లు కూడా పుచ్చుకునేవారున్నారట. ఇవ్వాళ ముంబయ్ తారలు ఇదే మంచి సంపాదనగా భావిస్తున్నారని కథనాలు కూడా వస్తున్నాయి. ఈ దోపిడీదార్లు వాళ్లింట్లో పెళ్లిళ్లకి ఎంతెంత ఖర్చు పెడతారో అంతే ఉండదు. కష్టపడి సంపాదించిన సొమ్ము కాదుగదా! జనం మీదపడి పీక్కుతిన్న సంపాదనేగా. ఎన్ని పోకడలు పోయినా సమస్యేలేదు.

మధ్య తరగతి పెళ్లిళ్లే సమస్యగా మారాయి. కనిపించని కల్లోలాలు సృష్టిస్తున్నాయి. ఆందోళనలు కలిగిస్తున్నాయి.

రాజేష్ ఎమ్మెస్సీ చదివాడు. ఒక రెసిడెన్షియల్ కాలేజీలో ట్యూటర్‌గా పనిచేస్తున్నాడు. జీతం ఎక్కువ రాదు. పెళ్లి కుదిరింది. రమేష్‌కి పరిచయస్తుల సంఖ్య ఎక్కువ. జీవితంలో ఒక్కసారి చేసుకునే వేడుక పెళ్లి, అందుకే గ్రాండ్‌గా చేసుకోవాలని కోరిక.

అమ్మాయి వాళ్లు రెండు లక్షలు కట్నంగా ఇచ్చారు. మరో ఆలోచన లేకుండా రాజేష్ ఆ రెండు లక్షలు పెళ్లికి ఖర్చుపెట్టేశాడు. పెళ్లికూతురు తల్లిదండ్రులు కూలీనాలీ చేసుకుని, తినీ తినకుండా కూడబెట్టుకున్న సొమ్ముని కట్నంగా ఇచ్చారు. కట్నం అంటే తనకి ఇచ్చిన డబ్బే కదా అని రాజేష్ దాన్ని ఖర్చుపెట్టేశాడు. ఇందుకు పెళ్లి కూతురు చాలా బాధపడింది. గడిచిన వయసూ, గతించిన కాలం, గోడకి కొట్టిన సున్నం, పెళ్లికి చేసిన ఖర్చు తిరిగి రమ్మంటే వస్తుందా?!

రాజేషే కాదు, మధ్యతరగతి కుటుంబాలు చాలా వరకు తెలిసో తెలియకో, ఉన్నవాళ్లని చూసి... వారిని అనుకరిస్తూ లేనిపోని ఆడంబరాలకు పోయి అప్పులపాలవుతున్నారు. చితికిపోతున్నారు.

వినీలా, సందీప్ విద్యార్థి ఉద్యమంలో కలిసి పనిచేసేవాళ్లు. ఇద్దరి మనసులు కలిశాయి. పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ఇరువైపుల తల్లిదండ్రులూ అంగీకరించారు. స్నేహితుల్ని, బంధువుల్ని, పరిచయస్తుల్ని పిలిచి మిఠాయి పంచి టీ ఇచ్చి దండలు మార్చుకున్నారు. వివాహం నిరాడంబరంగా జరిగింది.

ఇద్దరు వ్యక్తులు కలిసి జీవించడానికి, ఒక జంట ఏకం కావడానికి, రెండు హృదయాలు, తనువులు సహజీవనం చేయడానికి ఇన్ని హంగులూ, ఇంత హంగామా, ఆర్భాటం, ఖర్చులూ అవసరమా? ఆలోచిస్తే మంచిది!

- మొలకలపల్లి కోటేశ్వరరావు

ఉప్పు హోటల్

అంటే అక్కడి పదార్థాల్లో ఉప్పు మాత్రమే వేస్తారనుకుంటే పొరపాటే. ఆ హోటల్‌ను పూర్తిగా ఉప్పుతో నిర్మించారు. విషయం తెలిసిన వెంటనే అది ఎక్కడ వుందో తెలుసుకోవాలనే కుతూహలం కలగడం సహజమే. బొలీవియాలో వుందండీ. హోటల్ కట్టడానికి అంత ఉప్పును అక్కడికి ఎలా మోసుకెళ్లారు? అనుకోకండి. అసలు దీన్ని నిర్మించిందే ఉప్పు ఎడారిలో. అదీ 1993వ సంవత్సరంలో. చూడ్డానికి స్వీడన్‌లోని మంచు హోటల్‌లాగా వుంటుంది. మరి మంచు, ఉప్పు రెండూ తెల్లగానే వుంటాయికదా. కాకపోతే హోటల్ పైకప్పు, కరెంటు వస్తువులు, టాయిలెట్లు మాత్రం ఉప్పుతో చేసినవి కావు. ఇంక మిగతావన్నీ అంటే... గోడలు, కింద నేల, టేబుళ్లు, కుర్చీలు, అరమరలు...మొత్తం ఉప్పే ఉప్పు. పైకప్పుకు మాత్రం గడ్డిని ఉపయోగించారు. అన్నట్టు ఇక్కడ 15 పడక గదులు, 1 భోజనాలగది, బార్...వున్నాయి. మొత్తంమీద అసలు ఇదేంటో చూద్దామని వచ్చే సందర్శకుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోందట. మరి ప్రపంచంలోనే ఏకైక ఉప్పు హోటల్‌కదా. ఆ మాత్రం ఆసక్తి కనబరచడంలో వింతేముంది!

తెలుసా!

జీ...న్స్!

కొందరికి ఎవ్వరూ చేయనిది చేయాలంటే ఉత్సుకత. మరికొందరికి ఏదైనా వెరైటీగా చేయడమంటే ఇష్టం. సాధారణంగా ఇలాంటివారే రికార్డు సృష్టించాలనీ, అప్పటికే వున్న రికార్డులను బద్దలు కొట్టాలని ప్రయత్నిస్తుంటారు. అలాంటి ఉదంతమే ఇది. చూశారుగా...ఎంత పొడవాటి జీన్సో. కొలంబియాలోని మెడ్లిన్‌లో తయారుచేశారు దీన్ని. 141 అడుగుల పొడవు, 98 అడుగుల వెడల్పు వున్న ఈ ప్యాంటు బరువు చెప్పాలంటే కాస్త ఆయాసం తీర్చుకోవాల్సిందే. మరి అంత బరువు వుంటుంది. 7.5 టన్నుల బరువండీ ఈ ప్యాంటు. అమ్మో...ఇలాంటి పనులు చేసేవారు కూడా వుంటారా! అనుకోకండి. వుంటేనే కదా. అంత పెద్ద ప్యాంటు మన ముందు ప్రత్యక్షమైంది!



ఇంత పెద్ద సాలెగూడా!

చూశారుగా...చెట్లమీద ఎంత పెద్ద సాలెగూడు వుందో! టెక్సాస్‌లోని లేక్ టవాకొని స్టేట్ పార్క్‌లో వుంది. ఫుట్‌బాల్ ఆటస్థలమంత వున్న ఈ సాలెగూడును చూచి అలా నోరు తెరచి వుంచాల్సిందే సుమా. కాకపోతే ఇది ఏ ఒక్క సాలీడో చేసింది కాదు. కొన్ని మిలియన్ల సాలీళ్ల కష్ట ఫలం. అయితే కొంత భాగం నల్లగా అయిపోయింది. మరి సాలెగూళ్లల్లో చిక్కుకున్న దోమలు, ఈగల సారాన్ని సాలీళ్లు చప్పరించేస్తాయికదా. వాటి కళేబరాలన్నీ అలా మిగిలిపోతాయికదా. అందుకన్నమాట.

ఆ గౌను 1.5 మిలియన్ డాలర్లు

ఏంటీ...నిజమే! అంటున్నారా! ఇలాంటి విషయాలు ఉత్తినే చెప్తారా ఏంటండీ మరీను. నెమలిపింఛాలతో నిండిన ఈ గౌను చూపరులను బాగా ఆకట్టుకుంటోంది. మరీ అమ్మాయిలైతే కళ్లు తిప్పుకోలేకపోతున్నారంట. వెంటనే ఓసారి వేసేసుకోవాలనికూడా అనిపిస్తోందంట. కాకపోతే కాస్టే కాలిపోయేలా వుంది. ఆ...ఎంతండీ... 1.5 మిలియన్ డాలర్లే. 2009 నెమలి పింఛాలను ఉపయోగించి 8 మంది 2 నెలల పాటు రాత్రింబగళ్లు కష్టపడితే ఆ అద్భుతమైన పెళ్లి గౌను తయారైంది. అయినా అంత రేటు పెట్టి ఎవరు కొంటారులెండి. షాపువాడు దాన్నలా అద్దాల పెట్టెలో పెట్టి చూసుకోవాల్సిందే? అనుకుంటున్నారేమో! అంత ధర చెల్లించి క్షణాల్లో ఎగరేసుకుపోయారు. ఎక్కడా అంటారా! చైనాలోని జియాంగ్ ప్రావిన్స్‌లో. కాకపోతే చీటికి మాటికి దీన్ని వేసుకోవాలంటే కుదరదండోయ్! 'ఎందుకేంటి? అంత రేటు పెట్టి కొన్నాక మనిష్టమొచ్చినన్నిసార్లు వేసుకుంటాం' అంటారా! మీరన్నట్టు...వేసుకున్నా పెటా కార్యకర్తల కళ్లబడకుండా జాగ్రత్త పడాలి మరి.



ఎనిమిది తప్పులెక్కడ?

బుజ్జాయిలూ... కుక్క పిల్ల బాబుకు భలేగా షేక్ హ్యాండ్ ఇస్తోంది కదూ. అయితే ఈ బొమ్మలో ఎనిమిది తప్పులున్నాయి. అవేంటో చకచకా కనిపెట్టి చెప్పేయండి మరి.

జవాబు :1. బాబు కాలి సాక్సు, 2. బూట్లు, 3. గన్ ట్రిగ్గర్ పైకి వుంది, 4. కుర్చీ కాలు, 5. కుక్కపిల్ల షేక్ హ్యాంగ్ ఇచ్చే ఐదో కాలు, 6.గడియారం ముల్లు, 7. గోడమీద సీనరీలో సూర్యుడు, చంద్రుడు రెండూ వున్నాయి, 8. వాల్‌పోస్టర్ దారం ఓ పక్క తెగిపోయి వుంది.

మహ్మద్ గౌస్,
లార్డ్ వెంకటేశ్వరా హైస్కూల్,
9వ తరగతి, కర్నూల్



బాల కథ

బుద్ధి వచ్చింది

ఓ తెల్లపిల్లికి బుల్లి బ్లాక్ అండ్ వైట్ పిల్లి పుట్టింది. దాన్నేమో వాళ్లమ్మ చాలా గారాబంగా పెంచుతుంది. అడిగిందల్లా తెచ్చి ఇస్తుండేది. ఆ బుల్లి పిల్లి పెద్దయ్యేకొద్దీ బాగా పేచీలు పెట్టసాగింది. వట్టి మంకుపిల్లి అన్నమాట.

ఒకరోజు బుల్లి పిల్లి వాళ్లమ్మకు ఎర్రటి ఎలుక దొరికింది. దాన్ని చూస్తుంటేనే పిల్లికి నోరూరింది. కానీ తినకుండా చక్కగా కాల్చి మరింత రుచికరంగా తయారు చేసి బుల్లిపిల్లి కోసం తెచ్చింది. బద్ధకంగా నిద్రపోతున్న తన బుల్లి పిల్లిని తట్టి లేపింది. చాలా సేపటికి ఒళ్లు విరుచుకుంటూ మత్తుగా కళ్లు తెరిచింది.

"నీ కోసం ఎర్రెలుకని తెచ్చాను చూడు. చక్కగా కాల్చాను కూడా. మంచి రుచిగా వుంటుంది. తినమ్మా" అంది ప్రేమగా.

"ఛీ.. ఎలుక పాడుగాను. నాకదేం వద్దు" అంటూ ఎగిరిపడింది తల్లిమీద.

"మరేం కావాలి నాన్నా" అడిగింది ముద్దుగా.

"ఈ ఎలుకలు తినీ తినీ బోర్ కొడుతోంది" అంది అసహ్యంగా ముఖం పెట్టి.

"ఇది నల్లఎలుక కాదు నాన్నా. చెలకల్లో తిరిగే ఎలుక. దీని మాంసం చాలా రుచిగా వుంటుంది. ఒక్కసారి తిని చూడు" అంది బతిమాలుతూ.

"నాకు వద్దు గాక వద్దు. ఉపవాసం అయినా వుంటాను కానీ, ఎలుకను చచ్చినా తినను" అంది భీష్మిస్తూ.

"మరేం కావాలి నాన్నా" అడిగింది లాలనగా.

బుల్లి పిల్లి అటూ ఇటూ చూసింది. చెట్టుమీద పిచ్చుకలు కువకువలాడుతూ కనిపించాయి. "అవిగో ఆ పిల్లలు కావాలి. తీసుకురా" అంది తల్లిని.



"ఇప్పటిదాకా ఎలుక కోసం వేటాడి కాళ్లు నొప్పి పుడుతున్నాయి. చెట్టుమీద పిల్లలు దొరకడం కష్టం. మరోసారి నీకు పట్టి ఇస్తాలే. ఇవ్వాళ దీంతో కడుపు నింపుకో" అంది.

"నీకు కష్టమైతే నేను పడతాను చూడు" అని గబగబా బయటికి పరుగెత్తింది.

అది నేరుగా వేపచెట్టు ఎక్కింది. దాని మీద చాలా పిచ్చుకలు అల్లరిచేస్తూ ఆడుకోసాగాయి.

మెల్లగా పిల్లల దగ్గరకు వెళ్లింది. కానీ అంత దూరం నుంచి పిల్లిని చూడగానే రివ్వున పైకి లేచి మరో కొమ్మమీద కూర్చునేవి. మళ్లీ పిల్లి ఆ కొమ్మమీదకు పరుగెత్తేది. కానీ అక్కడ్నించి మరో కొమ్మమీద కూర్చునేవి. ఆ కొమ్మా ఈ కొమ్మా అంటూ అన్నింటిమీదా వాలుతూ పిల్లిని చెట్టుమొత్తం తిప్పించాయి. ఒక్క పిట్టను కూడా పట్టుకోలేకపోయింది. తిరిగి తిరిగి అలసి పోయింది. దాని కాళ్లు నొప్పిపుట్టాయి. అలసిపోయి కొమ్మమీద కూర్చుంది. ఒక తుంటరి పిల్ల దానికి దగ్గర్లోనే వాలి కవ్వించింది. పిల్లి పొంచి పొంచి అమాంతం దానిమీదకు దూకింది. కానీ పిల్లి మీదపడే లోపే అది తుర్రుమంది. ఇంకేముంది. అది పట్టుతప్పి దబ్బుమని కింద పడింది. దాని ముక్కు నేలకు గుద్దుకుంది. ఇంత పెద్దగా వాసింది.

కిందపడ్డ బుల్లి పిల్లి దగ్గరికి వాళ్లమ్మ పరుగున వచ్చింది. "చూశావు గద నాన్నా, ఆహారం సంపాదించడం ఎంత కష్టమో. దొరికినదాంతో తృప్తి పడాలి. మరోసారి మంచి ఆహారం దొరక్కపోదూ అనుకోవాలి" అంది ముక్కుకు పసుపు రాస్తూ.

బుల్లి పిల్లికి బుద్ధి వచ్చింది. "ఇంకెప్పుడూ గొడవ చేయనమ్మా. నువ్వు చెప్పినట్లే వింటా" అంది తల్లి ఒళ్లో తలపెట్టుకుని ఎలుకను చప్పరిస్తూ.

-పుప్పాల కృష్ణమూర్తి



రంగులు నింపేస్తే పోలా...

హాయ్... ఇక్కడున్న ఇంగ్లీషు అక్షరాల్లో మేం చెప్పిన రంగులు నింపుతారా? X దగ్గర నీలం, C ఉన్నచోట చాక్లెట్ రంగు, O దగ్గర గులాబీ రంగు, W దగ్గర ఆకుపచ్చ రంగు వేయండి. తర్వాత ఏం కనిపించిందో చూడండే!

కనిపెడతారా...

చిన్నారులూ...ఇక్కడ చూడండి. బోలెడు జీవులున్నట్లున్నాయి కదూ. అయితే అన్నీ కలిసిపోయి గందరగోళంగా వున్నాయ్. అవి మొత్తం ఎన్ని? వాటిలో జంతువులు ఎన్ని? పక్షులు ఎన్ని? చెప్పుకోండి.



మాటల కోట - 38

రూపకల్పన : కర్లపాలెం

1			2		3		4	5
		6			7			
	8		9	10			11	
12		13				14		15
		16			17			
18	19			20		21	22	
			23		24			
25		26			27			28
29			30				31	

అడ్డం :

1. పనికి నిరాకరణ, శ్రామికుల హక్కు (2)
2. మేలుకోరా హిందీలో (3)
4. కాయ కాని కాయే కానీ ఈ కాయ లేకపోతే మనిషే లేడు (2)
6. మాటల కోట కాదు... కోటలో టోపీ (2)
7. ఈ చుట్టుపై రోకటి పోటా! ప్రాణం పోయిందే! (2)
9. అరగదీస్తే మాత్రం దీని విలువ ఎక్కడికి పోతుంది! (3)
12. కనిపించని మూడో సింహమేరా (3)
14. వాలి బొడ్డులో ఇంగ్లీషు పొట్టి తాళం చెవి (3)
17. ఆ మారాజు నోట - 'పదం' ప్రతిపదార్థాన్ని వెతకండి! (2)
18. తెలుగు షాక్ అటునుండి (3)
21. ఈ ఊరు ఖద్దరుకి ప్రసిద్ధి. ఇదీ అటునుండే (3)
23. ఎటు నుండి చూసినా గానీ కొత్త కాంతే (3)
26. కిరాయి (2)
27. గోపాలుడు లేని కృష్ణుడు. అటు నుండి (2)
29. తిరగబడిన గీతం పోస్టుతో సమానం (2)
30. మరీ అర్థంలేని కులుకు (3)
31. ఈ మామిళ్లు ఎవరివి? (2)

నిలువు :

1. రవ్వంత - లేని రసమయ గీతాలు (2)
2. శివరాత్రినాడు ఎక్కువమంది చేసేపని (3)
3. అటునుండి పొట్టి బండి గోపాలరెడ్డి (3)
5. తల తిరుగుతోందా? (2)
8. బాలు లేని బంతాట (2)
10. ఓబులాపురం అనంగానే ముందుగా గుర్తొచ్చే వాయువు (2)
11. నకిలీ బంగారం నకిలీ (2)
12. మహేష్‌బాబు సూపర్ హిట్ చిత్రం (3)
13. మంచి బుద్ధి గలవాడంటే బద్దెన (3)
14. ఇంగ్లీషు నీరు (3)
15. తమిళ పాయసం. కింద నుండి (3)
19. నెల్లూరు జిల్లా అమ్మాయి అటునుండి (2)
20. పచ్చి (2)
22. పాండవోద్యోగాలలో కృష్ణుని పాత్ర (2)
23. మేడలు (3)
24. మిణుగురు పురుగుల వెలుగు (3)
25. అడ్డం తిరిగిన 29 అడ్డం (2)
28. రాచకొండ వారంటే ఈ చెట్టా?! (2)

మాటలకోట - 37జవాబు

1 గ	ద		2 శ్ర	3 మ		4 క	డ	5 లి
తి		6 ప	ద్ధ	తి		డ		క్కి
	7 భం	లా		8 క	గు	సా		
9 టు	గ	స		క		10 రి	11 వా	జు
12 చే	ప		13 ర		14 ఓ		కి	
	15 డు	16 క	వా			17 క	లి	18 మి
19 వే		20 ర	ధి	21 కు	22 డు			ట్ట
23 దు	24 కం	వా		25 రు	తా	26 మా	27 రు	
28 క	ర	లం	ణ	అ		29 పు	నా	ది

తల్లితో...

టర్కీ చిట్టెమ్మ

ఫొటోలో కనిపిస్తున్న చిట్టెమ్మ వయసు 21 ఏళ్లంటే నమ్ముతారా! ఊహూ.. నిజ్జంగా తన వయసు ఇరవై పైనే. అతి చిన్న మహిళగా ఈ మధ్యే గిన్నిస్ బుక్‌లో కూడా ఎక్కేసింది. తన పేరు హేటిస్ కోకమేన్. వయసు ముందే చెప్పేసుకున్నాం కదా. పొడవు! 28 అంగుళాలు. బరువు సంగతా! 6.8 కేజీలు. మామూలుగా అందరిలాగే ఆరోగ్యంగానే పుట్టింది. ఏడాది వరకు బాగానే వుంది. తర్వాతే తనలో మార్పులు కనిపించాయి. ఇతర పిల్లల్లా కాకుండా భిన్నంగా వుండేది పెరుగుదల. డాక్టర్లకు చూయిస్తే ఒక విషయం చెప్పారు. తల్లిదండ్రుల్లో వున్న జన్యు లోపాలవల్ల హేటిస్‌కు ఎముకలకు సంబంధించిన జబ్బు సోకిందని. ఇంక అప్పటి నుంచి ఇలా తయారైంది. స్కూల్లో చదువుకునేటప్పుడు తోటి పిల్లలు తనను చూసి నవ్వేవారు. ఎగతాళి చేసేవారు. అప్పుడు తెలీదు ఆ లోపం వల్లే ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తిగా వార్తలకెక్కుతానని. అయితే...టర్కీ చిట్టెమ్మకు ఓ కోరిక వుంది తెల్సా! అదేంటంటే... ఎప్పటికైనా ఎవరో ఒకరు తనను ప్రేమించి పెళ్లాడాలని. మరి ఆ కోరిక తీరుతుందో లేదో!



అందమైన చేతివ్రాత - ఉచిత శిక్షణ

Send SMS... "HRC" space "Your address" to 55352

India's No.1 Handwriting Expert, Graphologist, Graphotherapist, NLP Trainer, Handwriting Research Centre (HRC) అధినేత చదువుల డాక్టర్‌గా బిరుదాంకితులైన Sri. Bhasckarr Raaju గారి "గుడ్ హ్యాండ్రైటింగ్" ప్రత్యక్ష శిక్షణలో నిష్ణాతులైన 150 మంది శిక్షకులు రాష్ట్ర నలుమూలల వారి వారి ప్రాంతాలలో అందమైన చేతి వ్రాతను బోధిస్తున్నారు!!

HANDWRITING HOMESTUDY KIT ను సొంతం చేసుకొన్న వారికి అందమైన చేతివ్రాతపై ఉచిత శిక్షణ!!



FREE

మీ స్పెల్లింగ్ సమస్యకు పరిష్కారం ... మీ సెల్ ఫోన్‌లో ఉచితంగా...!!

SPELLING సమస్యా...?!

పరిష్కారం కొరకు...

Send SMS... HRC space SPELL to 55352

Specially designed to... 3rd to 10th Class



ప్రపంచంలో మొట్టమొదటిసారిగా ...
అందమైన చేతివ్రాతను సొంతం చేసుకోవడానికి
రూపొందించబడిన Hai-Pad, Hai-Slate లను సొంతం చేసుకోండి!
అందమైన చేతివ్రాత మీ సొంతం అవుతుంది!!

వివరములకు దిగువ కనబరచిన మీ సమీప డిస్ట్రిబ్యూటర్స్‌ను సంప్రదించండి!!

Chittoor : Bhasckarr Raaju Enterprises, ✆ : 9966555536, **Nellore** : Nazeem Enterprises, ✆ : 9440928532, **Guntur** : Sree Vigneshwara Enterprises, ✆ : 9440022999, **Krishna** : Bee Hive Enterprises, ✆ : 9866869649, **East Godawari** : Excellence Enterpises, ✆ : 9440776596, **Vizag** : K Enterprises, ✆ : 9396409988, **Warangal** : Sai Agencies, ✆ : 9347551328, **Ananthapur** : Akshara Distributors, ✆ : 9966987577.

మిగిలిన జిల్లాల్లో డిస్ట్రిబ్యూషన్ కొరకు వెంటనే సంప్రదించండి!!

For any information feel free to contact...

Bhasckarr Raaju ... *Good Handwriting for All*

HANDWRITING RESEARCH CENTRE

1-5-565 Balaji Colony, TIRUPATI.

Cell : 9000072359, 9246997139